బిజెపి గూటికి అవినీతి నేతల క్యూ

- కేసులన్నీ గాలికి.. పార్టీలో చేర్చుకుంటూ పదవులు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 337 | విజయవాడ, శనివారం 8 జూలై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 8 July 2023 | Rs

14 నుంచి ఇ-సెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కోర్సు రెండో ఏడాది ప్రవేశాలకు ఇ-సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి విడుదల చేశారు. ఈ నెల 10న నోటిఫికేషన్ విడుదల చేస్తామమన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన జారీచేశారు. ఇ-సెట్-2023లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు ఎపి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సివుంటుంది. 19 నుంచి 21 వరకు ఆప్షన్ల ఎంపిక ఉంటుంది. 22న ఆప్షన్లు మార్చుకోవచ్చు. జులై 25న సీట్లు కేటాయిస్తారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఇ-సెట్-2023లో 31,393 మంది అర్హత సాధించారని, ధ్రువీకరణ పత్రాల నిర్ధారణ, కౌన్సెలింగ్ ప్రక్రియ తదితర అంశాల కోసం రాష్ట్రంలో 14 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటు కోసం 2020 జనవరి 1 తరువాత జారీ చేసిన ధ్రువపత్రాలనే అందజేయాలన్నారు. వివరాలకు 7995681678, 7995865456, 9177927677 నెంబర్లను సంప్రదించవచ్చు.



లోకనాథంకు పూలమాల వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరావు, సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావుకు పూలమల వేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

'ఉక్కు'పై కుట్రలు సాగనివ్వం

- బిజెపిని గద్దె దింపేందుకు కార్మికవర్గం సిద్ధం కావాలి
- విశాఖ ఉక్కు పరిరక్షణకు సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల 24 గంటల దీక్ష ప్రారంభిస్తూ వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఒక ఫ్యాక్టరీని నడపలేని వారికి అధికారం ఎందుకు? ప్రభుత్వ రంగాన్ని లూటీ చేయడమే పాలనా? విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నడపలేని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ గద్దెమీద కూర్చొంటే ఎంత? పోతేఎంత ?' అంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ గొంతు నులిమే కుట్రలు సాగనివ్వబోమని, కర్మాగారం పరిరక్షణకు ప్రాణత్యాగానికైనా సిద్ధమని తేల్చి చెప్పారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శుల 24 గంటల దీక్ష శుక్రవారం ఉదయం పది గంటలకు ప్రారంభమైంది. దీక్షల్లో ఎం.జగ్గునాయుడు (విశాఖ), కె.లోకనాథం (అనకాపల్లి), పి.అప్పలనర్స (అల్లూరి సీతారామరాజు), టి.సూర్యనారాయణ (విజయనగరం), డి.వెంకటరమణ (పార్వతీపురం మన్యం), డి.గోవిందరావు (శ్రీకాకుళం) కూర్చున్నారు. శనివారం ఉదయం పది గంటల వరకూ జరిగే ఈ నిరాహార దీక్షను శ్రీనివాసరావు ప్రారంభిస్తూ మాట్లాడారు. 876 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం పోరాడుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పందించకుండా మొండి మూర్ఖత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ సాధ్యం కాదని భావిస్తున్న కేంద్రం ప్లాంట్‌ను నిర్వీర్యపరచడమే లక్ష్యంగా బ్లాస్ట్ ఫర్నేస్‌ను పనిచేయకుండా చేసిందన్నారు. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా అంటూ కబుర్లు చెప్పడం కాదని, అమెరికా, దక్షిణ కొరియాలతో పోటీపడి స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రోత్సాహం ఇవ్వకుండా గొంతు నులిమి చంపాలనుకోవడం హత్య కన్నా నేరమని పేర్కొన్నారు. మోడీ హయాంలో విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. బిజెపి తీరును ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజలు తిరస్కరిస్తున్నారని తెలిపారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి తోడ్పడిన స్టీల్‌ప్లాంట్‌ను శ్మశాన మిగతా 2లో

కంపెనీలకే ధీమా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

విపత్తులతో పంటలు నష్టపోయిన రైతన్నలకు ఆసరా కావాల్సిన పంటల బీమా కాస్తా ప్రభుత్వ విధానాలతో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు అపరిమిత లాభాలు పోగేసుకోడానికి బాగా ఉపయోగపడుతోంది. నిరుటి ఖరీఫ్ రైతులకు చెల్లించనున్న బీమా పరిహారం ప్రతిపాదనలు కంపెనీల లూటీని బయటపెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వలన ఇన్సూరెన్స్ కంపెనీలు బాగుపడుతున్నాయని వైసిపి ప్రభుత్వం కేంద్ర పథకం నుంచి వైదొలిగింది. సొంతంగా 'వైఎస్ఆర్ ఉచిత పంటల బీమాను తొలి మూడేళ్లు అమలు చేసింది. కేంద్రం ఒత్తిడితో తిరిగి 2022 ఖరీఫ్ నుంచి కేంద్ర పథకంలో చేరింది. ప్రీమియంలో రైతు వాటా తానే పెట్టుకుంటోంది. దిగుబడి ఆధారిత పంటల బీమా అమలుకు బిడ్డింగ్ ద్వారా కంపెనీలను ఎంపిక చేసి, వాతావరణ ఆధారిత బీమాను గతంలో మల్లే కంపెనీలతో సంబంధం లేకుండా తానే సొంతంగా అమలు చేసింది. కాగా 2022 ఖరీఫ్ బీమా క్లెయిములను ఖరారు చేసి అభ్యంతరాల స్వీకరణకు ఆర్‌బికెలలో ప్రదర్శించారు. కంపెనీలు అమలు చేసిన దిగుమతి ఆధారిత బీమాలో రైతులకు వచ్చింది స్వల్పం కాగా కంపెనీలు పోగేసుకున్నది చాలా ఎక్కువ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిపి రైతుల తరఫున కంపెనీలకు చెల్లించిన ప్రీమియం రూ.1,882.61 కోట్లు. కంపెనీలు రైతులకు చెల్లించతలపెట్టిన పరిహారం రూ.572.56 కోట్లు మాత్రమే. కంపెనీల లాభం దాదాపు రూ.1,310 కోట్లు. ఇందులో ప్రైవేటు కంపెనీల లాభం రూ.781 కోట్లుగా ఉంది.

రైతుకు లేదు బీమా



- ఫసల్‌లో చేరాక దారుణం
- ప్రీమియం రూ.1,882 కోట్లు
- ఇన్సూరెన్స్ రూ.572 కోట్లు
- సంస్థలకు రూ.1,310 కోట్లు మిగులు
- ప్రైవేటు లూటీ రూ.780 కోట్లు

పబ్లిక్ సంస్థలే బెటర్

రాష్ట్రంలోని 26 జిల్లాలను తొమ్మిది క్లస్టర్లుగా విభజించి కంపెనీలను ఎంపిక చేసి దిగుబడి ఆధారిత పంటల బీమా అమలు చేశారు. హెచ్‌డిఎఫ్‌సి, రిలయన్స్ రెండేసి క్లస్టర్లు, ఇఫ్‌కో టోకియో ఒక క్లస్టర్ తీసుకోగా ప్రభుత్వరంగ సంస్థలైన ఎస్‌బిఐ, ఎఐసిలు రెండేసి క్లస్టర్లు తీసుకున్నాయి. ఉన్నంతలో ప్రభుత్వరంగ సంస్థలైన ఎఐసి, ఎస్‌బిఐలు రైతులకు కొంత న్యాయం చేయగా, ప్రైవేటు కంపెనీలు ప్రీమియాన్ని కొల్లగొట్టేపనిలోనే ఉన్నాయి. మొత్తం రూ.572 కోట్ల పరిహారం చెల్లింపులకు ఓకే చేయగా, అందులో రూ.502 కోట్లు ప్రభుత్వరంగ సంస్థలైన ఎఐసి, ఎస్‌బిఐ చెల్లిస్తున్నాయి. ప్రైవేటు కంపెనీలు కేవలం రూ.70 కోట్లిస్తున్నాయి. ఎఐసి, ఎస్‌బిఐ దాదాపు వెయ్యి కోట్ల ప్రీమియం వసూలు చేసి రైతులకు వాటిలో సగభాగం పంపిణీ చేస్తుండగా, ప్రైవేటు సంస్థలు రూ.800 కోట్లకుపైన ప్రీమియం వసూలు చేసి రూ.70 కోట్లే రైతులకు ఇస్తున్నాయి. రైతుల తరఫున ప్రభుత్వాలు చెల్లించిన ప్రీమియంలో దాదాపు రూ.780 కోట్లు ప్రైవేటు కంపెనీలు మిగిల్చుకుంటున్నాయి.

సున్నా క్లెయిములు వారివే..

అన్నమయ్య, గుంటూరు, విశాఖపట్నం జిల్లాలకు దిగుబడి ఆధారిత బీమా క్లెయిములు సున్నా. ఆ జిల్లాలకు ఇంప్లిమెంట్ ఏజెన్సీలుగా వ్యవహరించింది ప్రైవేటు సంస్థలే. అన్నమయ్య జిల్లాకు హెచ్‌డిఎఫ్‌సి, గుంటూరుకు రిలయన్స్, విశాఖపట్నానికి ఇఫ్‌కో టోకియో అమలు చేశాయి. అనంతపురంలో రూ.269 కోట్ల ప్రీమియం వసూలు చేసిన రిలయన్స్ సంస్థ రైతులకు కేవలం రూ.43 కోట్లిస్తోంది. కృష్ణా జిల్లాలో వంద కోట్లకు పైన ప్రీమియం వసూలు చేసిన ఇఫ్‌కో టోకియో కంపెనీ రూ.57 లక్షల పరిహారం నిర్ధారించింది. ఎన్‌టిఆర్ జిల్లాలో వంద కోట్ల ప్రీమియం తీసుకున్న ఆ కంపెనీ రూ.3.92 కోట్ల క్లెయిములు ప్రతిపాదించింది. శ్రీకాకుళంలో హెచ్‌డిఎఫ్‌సి సంస్థ రైతుల పక్షాన వంద కోట్ల ప్రీమియం తీసుకొని రూ.32 లక్షల క్లెయిములు ఇస్తానంది. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా ఎఐసి పరిహారం ఇస్తోంది. ఆ జిల్లా రైతుల తరఫున రూ.191 కోట్ల ప్రీమియం తీసుకున్న ఎఐసి రూ.172 కోట్ల పరిహారం ఇస్తోంది. అలాగే కడపలో రూ.245 కోట్ల ప్రీమియం తీసుకొని రూ.139 కోట్లు రైతులకు పరిహారం చెల్లిస్తోంది.

కంపెనీల లాభాలు (రూ.కోట్లలో)

ఇన్సూరెన్స్ కంపెనీ	ప్రీమియం	పరిహారం	లాభం
హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో	254.39	8.52	245.87
రిలయన్స్	381.69	57.28	324.41
ఇఫ్‌కో టోకియో	215.35	4.49	210.86
ఎఐసి	743.92	325.77	418.35
ఎస్‌బిఐ	297.15	176.73	120.42

మెటా థ్రెడ్స్‌పై కేసు వేస్తాం : ట్విట్టర్



3

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా డివిజి శంకరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ దాడిచిలుక వీర గౌరి శంకరరావు (డివిజి శంకరరావు)ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 330ని శుక్రవారం విడుదల చేసింది. పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రెండేళ్ల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. పార్వతీపురం మన్యం



జిల్లాకు చెందిన డివిజి శంకరరావు ఎంబిబిఎస్ చేశారు. ఈయన 30.4.1968న సాంబమూర్తి దంపతులకు జన్మించారు. 1999లో టిడిపి ఎంపిగా అభ్యర్థిగా గెలుపొందారు. ఈయనకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం వైసిపి ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా వ్యవహరిస్తున్నారు.

ఫలక్‌నుమాలో మంటలు

- ఐదు బోగీలు దగ్ధం
- ప్రయాణికులు క్షేమం, విలువైన ఫైళ్లు, సామగ్రి ఆహుతి



దగ్ధమవుతున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ బోగీలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రైలు ప్రమాదాలు ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒడిశాలోని బాలాసోర్‌లో రైలు ప్రమాద ఘటన మరవకముందే శుక్రవారం మరో ప్రమాదం జరిగింది. హౌరా నుంచి సికింద్రాబాద్ వస్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) ఎస్2 బోగీలో మధ్యాహ్నం 12.05 గంటలకు మంటలు చెలరేగి పొగలు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమై లోకో పైలట్‌కు సమాచారం ఇవ్వడంతో బిబి నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలును నిలిపివేశారు. ప్రాణభయంతో ప్రయాణికులు తమ విలువైన వస్తువులు, ఇతర లగేజీలను వదిలేసి ఉన్నపళాన కిందికి దిగారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఎస్2 బోగీ నుంచి ఎస్ 3, ఎస్ 4, ఎస్ 5, ఎస్ 6 బోగీలకు వ్యాపించాయి. కాలిపోతున్న బోగీలను రైల్వే సిబ్బంది వేరుచేశారు. దీంతో, మంటలు ఇతర బోగీలకు వ్యాపించలేదు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి రావడానికి రోడ్డు మార్గం లేకపోవడంతో అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి సకాలంలో రాలేకపోయాయి. ఐదు బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక బోగీ పాక్షికంగా కాలిపోయింది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్, మెడికల్ టీములు చేరుకుని ప్రయాణికులకు అవసరమైన సేవలందించాయి. ఇతర బోగీలతో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ వెళ్లేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కొంతమంది ప్రయాణికులను బస్సుల్లో తరలించారు. కాలిపోయిన బోగీలను అక్కడ నుంచి తరలించి సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బిబినగర్ - గుంటూరు మార్గంలో రైళ్లను పునరుద్ధరించారు. రైలు ప్రమాదంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బోగీల్లో షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం : ప్రయాణికులు

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు. ఒడిశాలో ఘోర ప్రమాదం జరిగిన తర్వాత కూడా ఎలాంటి భద్రతా చర్యలు పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో విలువైన సామగ్రి, సర్టిఫికెట్లు, నగదు కాలిపోయాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

రాహుల్‌కు దక్కని న్యాయం

- 'మోడీ ఇంటి పేరు' కేసులో శిక్షపై స్టే విధించడానికి గుజరాత్ హైకోర్టు నిరాకరణ
- సుప్రీంకు వెళ్తాం : కాంగ్రెస్



గాంధీనగర్, న్యూఢిల్లీ : పరువునష్టం కేసులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి గుజరాత్ హైకోర్టులో చుక్కెదరయింది ఈ కేసులో తనను దోషిగా నిర్ధారించడాన్ని, తనకు విధించిన రెండేళ్ల శిక్షను నిలిపివేయాలంటూ రాహుల్ గాంధీ వేసిన స్టే పిటిషన్‌ను గుజరాత్ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ కేసులో సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును అది సమర్థించింది. 'రాహుల్ ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 10 క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. ఇక ఈ కేసులో ఆయనకు కిందికోర్టు శిక్ష విధించడం సరైనదే, న్యాయపరమైనదే. ఈ శిక్షను నిలిపివేసేందుకు ఎలాంటి కారణాలు కన్పించట్లేదు. అందుకే పిటిషనర్ అభ్యర్థనను కొట్టివేస్తున్నాం" అని జస్టిస్ హేమంత్ ప్రచక్ తీర్పు వెలువరించారు. రాహుల్ పిటిషన్‌పై మే రెండునే విచారణను ముగించిన హైకోర్టు శుక్రవారం తీర్పును వెల్లడించింది. ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారు సచ్ఛీలతను కలిగి ఉండాలని హైకోర్టు పేర్కొంది. వీర సావర్కర్ మనవడు చేసిన ఫిర్యాదును కూడా హైకోర్టు ప్రస్తావించింది. 2019 లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకలో మాట్లాడుతూ 'దొంగలందరికీ మోడీ అనే ఇంటి పేరే ఎందుకు ఉంటుంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు గాను రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ఈ పరువు నష్టం కేసును సూరత్ కోర్టులో బిజెపి శాసనసభ్యుడు పుర్ణేష్ మోడీ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఈ ఏడాది మార్చిలో తీర్పు వెలువరించింది. ట్రయల్ కోర్టు తీర్పు వెలువరించిన 24 గంటల్లోనే రాహుల్‌పై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం, పార్లమెంటు సభ్యులు ఏదైనా కేసులో దోషిగా నిర్ధారణయి, కనీసం రెండేళ్ల శిక్ష పడితే అనర్హత వేటు పడుతుంది. ట్రయల్ కోర్టు తీర్పుపై మిగతా 5లో

బ్రిజ్ భూషణ్‌కు సమన్లు

- 18న విచారణకు హాజరుకావాలి : ఢిల్లీ కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై నమోదైన కేసు విచారించదగినదేనని ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు స్పష్టం చేసింది. ఈనెల 18న మధ్యాహ్నం 2:30 గంటలకు కోర్టు ముందు విచారణకు హాజరుకావాలని బ్రిజ్ భూషణ్‌కు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ సమన్లు జారీ చేశారు. సహ నిందితుడు, డబ్ల్యుఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌కు కూడా సమన్లు జారీ అయ్యాయి. నిందితులపై విచారణ జరిపేందుకు తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై జూన్ 15న దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణలోకి తీసుకుంది. బ్రిజ్ భూషణ్‌పై ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.



'కోరంగి'పై కొరవడిన సంరక్షణ

- చెట్లను ధ్వంసం చేసి సారా తయారీ కేంద్రాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

విభిన్న జీవ రాశులకు ఆవాసంగా ఉన్న మడ అడవుల సంరక్షణను అధికారులు గాలికి వదిలేశారు. ఈ ప్రాంతంలో వృక్షాల నరికివేత, నాటు సారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో, జీవ రాశుల మనుగడ, ప్రకృతి సమతుల్యత ప్రశ్నార్థకమవుతోంది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి అభయారణ్యం సుమారు 61 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. 36 వివిధ రకాల వృక్ష జాతులు ఇక్కడ ఉన్నాయి. 300 రకాల జీవజాతులకు ఈ మడ అడవులు ఆవాసం కల్పిస్తున్నాయి. 92 రకాల విదేశీ పక్షి జాతులకు ఇది విడిది కేంద్రంగా ఉంది. కొల్లేరు, పులికాట్ సరస్సుల తర్వాత ఆ స్థాయిలో ప్రతి ఏటా అక్టోబరు నుంచి జనవరి మధ్యలో రష్యా, చైనా, ఆస్ట్రేలియా తదితర దేశాల నుంచి వలస పక్షులు ఇక్కడకు వస్తుంటాయి. మైమరపించే ప్రకృతి సౌందర్యంతో పాటు విభిన్నమైన జీవవైవిధ్యం అధిక సంఖ్యలో కలిగిన అభయారణ్యంగా ఐక్యరాజ్య సమితి ఈ ప్రదేశాన్ని గుర్తించింది. అందంగా, దట్టంగా పెరిగే ఈ అడవులు సముద్రపు మిగతా 5లో

ఉచితంపై వేటు!

- తగ్గుతున్న ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు
- 1.41 లక్షల కుటుంబాలకు షాక్
- విద్యుత్ భారం తగ్గించుకునే పనిలో ప్రభుత్వం
- సచివాలయాల డేటాతో ఇపిడిసిఎల్ కత్తెర



మోడీని సాగనంపితేనే దేశానికి రక్ష

వచ్చే నెల 9న విజయవాడలో మహాధర్నా

- కార్మిక సంఘాల సదస్సు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 9న మహాధర్నా నిర్వహించాలని కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. జాతీయ ఐక్యత, సమగ్రతతోపాటు దేశ సమగ్రతను రక్షించేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు 'దేశ్‌కి బచావో-మోడీ హటావో' 'క్విట్ మోడీ - సేవ్ ఇండియా' 'సేవ్ పబ్లిక్ సెక్టార్-సేవ్ డెమొక్రసీ అండ్ నేషన్' అని గట్టిగా నినదించాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సదస్సు ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సదస్సుకు అధ్యక్ష వర్గంగా ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి రాధాకృష్ణమూర్తి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, ఎఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షులు కె సుధీర్ వ్యవహరించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మోడీ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కార్మికవర్గం-రైతాంగం- గ్రామీణ పేదలు, ఇతర వర్గాల సమూహాలను ఐక్యం చేసి క్విట్ ఇండియా దినోత్సవ రోజైన ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా జరపతలపెట్టిన శ్రామిక గర్జన మహాపడావో (మహాధర్నా)లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సదస్సు మరో తీర్మానాన్ని ఆమోదించింది. ఆగస్టు 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో మోటారు సైకిల్ జాతాలు, 8న మానవహారాలు, 9న విజయవాడలో మహాధర్నా వుంటాయని తెలిపింది. నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ వర్కర్స్ 14 పాయింట్లు చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా సదస్సు తీర్మానం చేసింది.



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ.. నయా ఉదారవాద విధానాలను భుజానేసుకున్న కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో ఆర్థిక, కార్మిక, బ్యాంకుల సంస్కరణల ద్వారా దేశ పౌరులను లూటీ చేసిందన్నారు. జాతీయ ఐక్యత, సమగ్రత కోసం దేశాన్ని, ప్రజలను రక్షించడానికి ఉమ్మడి కార్యాచరణతో దేశంలోని అన్ని రంగాలు, భాగాలకు ప్రాతినిధ్యం వహించే కేంద్ర కార్మిక సంఘాలు ఆగస్టు 9న శ్రామిక గర్జన మహాపడావో పేరుతో పిలుపునిచ్చాయన్నారు. మోడీ ప్రభుత్వ ముదనష్టపు విధానాలను మిగతా 2లో

ఆక్వా రంగ ఎగుమతులే జిడిపి పెరుగుదలలో కీలకం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

ఆక్వా రంగ ఎగుమతులే జిడిపి ఎదుగుదలలో అత్యంత కీలకమని, రాష్ట్రంలో మత్స్య సంపద అపారంగా ఉందని కేంద్ర భూ విజ్ఞానశాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మత్స్యకారులకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆక్వా రంగంలో రాష్ట్రం ముందంజలో ఉందని, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర వాతావరణ సమస్యలను ఎదుర్కొనేలా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ఏడు వేల కిలోమీటర్ల సముద్ర తీరం ఉందని, భారత్ జిడిపి ప్రపంచంలోనే ఐదో స్థానంలో ఉందని అన్నారు. టెక్నాలజీ సహకారంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లిన సమయాల్లో మత్స్య సంపద ఎక్కడ ఎక్కువగా ఉంటుందనేది ముందుగానే తెలియజేస్తున్నామన్నారు. మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పివిఎన్ మాధవ్, వేటుకూరి సూర్యనారాయణరాజు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ, ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌ఛార్జి బ్రహ్మం, అడ్డూరి శ్రీరామ్ పాల్గొన్నారు.

సింథటిక్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ అధికారుల కోసం ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన సింథటిక్ బ్యాడ్మింటన్ కోర్టును డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం విజయవాడలోని పోలీస్ అధికారుల విశ్రాంతి భవనం ఆవరణలో ఈ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఐజి రాజశేఖర్‌బాబు, విజయవాడ సిటీ కమిషనరు కాంతిరాణా టాటా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గుజరాత్ కోర్టు తీర్పు దిగ్భ్రాంతి కలిగించింది

- ఎఐసిసి నాయకులు శివాజి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాహుల్ గాంధీ విషయంలో గుజరాత్ కోర్టు ఇచ్చిన తీర్పు దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎఐసిసి నాయకులు కొలనుకొండ శివాజి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టులపై తమకు పూర్తి విశ్వాసం, నమ్మకం ఉందని, అయినా ఇలాంటి తీర్పులు రావడం సరికాదని అన్నారు. గుజరాత్ అల్లర్లకు 20 ఏళ్లు పూర్తవుతున్నా అక్కడ బాధితులకు నేటికీ న్యాయం జరగకపోవడం అన్యాయమన్నారు. ఇష్రత్, ఇంతియాజ్ పఠాన్, బిల్కిస్‌బాను కేసులో నేటికీ న్యాయం జరగలేదని విమర్శించారు. రాహుల్ గాంధీపై కక్షసాధింపు చర్యలకు దిగడం సరైంది కాదని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.



రిజిస్ట్రేషన్ కార్యాలయంలో షర్మిల, రాజారెడ్డి, అంజలి

కుమారుడు, కుమార్తెకు షర్మిల భూములు బదలాయింపు

ప్రజాశక్తి - వేంపల్లె (కడప)

తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు షర్మిల తన పేరు మీద ఇడుపులపాయలో ఉన్న భూములను కుమారుడు, కుమార్తె పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. శుక్రవారం వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. షర్మిల పేరు మీద ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న 9.53 ఎకరాల భూమిని తన కుమారుడు రాజారెడ్డి పేరు మీదకు మార్చారు. షర్మిల పిఎ పేరు మీద ఉన్న 2.12 ఎకరాల భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిన్నాన్న వైఎస్.సుధీకర్‌రెడ్డి పేరుపై ఉన్న 2.75 ఎకరాలను షర్మిల కుమార్తె అంజలిదేవి పేరు మీదకు బదలాయించారు. రిజిస్ట్రార్ కార్యాలయానికి షర్మిల వచ్చారనే విషయం తెలియడంతో వైసిపి నాయకులు భారీ సంఖ్యలో అక్కడికి తరలి వచ్చారు. రిజిస్ట్రేషన్ అనంతరం ఆమె ఇడుపులపాయకు చేరుకున్నారు.

రొయ్య రైతు బేజారు

పంట చేతికొచ్చే సమయంలో పడిపోయిన ధర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్వా రైతులకు వేసవి సాగు నిరాశను మిగుల్చుతోంది. ప్రతికూల వాతావరణంలో, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యల సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పున అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో వేసవి సాగు కూడా లాభాల పంట పండిస్తుందని ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. పంట చేతికొచ్చే సమయంలో ధర పతనం అవ్వడంతో లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం 100 కౌంట్ ధర 190 ఉంది. 50 కౌంట్ ధర రూ.260కు మించడం లేదు. 80 కౌంట్ ధర రూ.230 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ ఉన్నాయి. కనీసంగా రూ.230 ధర ఉంటేనే గిట్టుబాటు అవుతుందని వారు అంటున్నారు.



ఆశలు ఆవిరి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల కుటుంబాలు ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లాలో 11 రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. 13 మంది ప్రధాన కొనుగోలుదారులు ఉన్నారు. జిల్లా నుంచి ఏటా సుమారు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 1.35 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కోవిడ్ మొదటి దశ, రెండో దశలో విదేశాలకు ఎగుమతులు పూర్తిగా స్తంభించాయి. తప్పనిసరి పరిస్థితుల్లో దేశీయ మార్కెట్లో తక్కువ ధరకు విక్రయించక తప్పలేదు. ఆ తర్వాత సానుకూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ నవంబరులో అధిక వర్షాలు, డిసెంబర్, జనవరిలో విపరీతమైన చలి కారణంగా వైరస్‌లు విజృంభించాయి. వేల ఎకరాల్లో రొయ్యల పంట తుడిచిపెట్టుకుపోయింది. ప్రతికూల పరిస్థితులలో పంటను కాపాడుకున్న రైతులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో మంచి ధర లభించింది. అదే ఆశతో రైతులు అధిక పెట్టుబడులు పెట్టి వేసవి సాగు చేశారు. ధరలు లేక ప్రస్తుతం నష్టాలు చవిచూస్తున్నారు. .

అమలు కాని ప్రభుత్వ ధర

ప్రభుత్వం విద్యుత్ రాయితీలోనూ జోన్‌ల పేరుతో ఈ ఏడాది కోత విధించింది. మరోవైపు ఎరువుల మేత ధరలు విపరీతంగా పెరిగాయి. 100 కౌంట్‌కు కనీసం రూ.210 చెల్లించాలని ప్రభుత్వ నిబంధనలు విధించింది. ఆచరణలో అధికారుల పర్యవేక్షణ కొరవవండడంతో రైతులకు ఈ ధర కూడా దక్కట్లేదు. పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో కొనుగోలు జరుగుతున్నా, చిన్న రైతులను దళారులు నిలువునా దోపిడీ చేస్తున్నారు. రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. పంటను నిల్వ చేసుకునే అవకాశాలు లేక దళారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

వేసవి నిరాశ పరిచింది

ఈ ఏడాది వేసవి సాగు పూర్తిగా నిరాశ పరిచింది. ప్రభుత్వం రోజుకు 8 గంటలు విద్యుత్ కోత విధించింది. 5 ఎకరాలు కౌలుకు తీసుకుని రొయ్యల సాగు చేస్తున్నాను. విద్యుత్ కోసం ఎకరాకు రూ.3,500 చొప్పున 8 ఎకరాలకు రోజుకు రూ.28 వేలు అదనపు ఖర్చు పెరిగింది. రొయ్యల మేత ధరలూ పెరగడంతో ఎకరా సాగుపై లక్ష రూపాయలు అదనపు భారం పడింది. ప్రస్తుతం 100 కౌంట్‌కు రూ.190కి మించి ధరల లభించడం లేదు. చిన్న రైతులు కోలుకునే పరిస్థితులు లేవు.

- వై. వెంకటేశ్వరరావు, వేమవరం, ఐ.పోలవరం మండలం, కోనసీమ జిల్లా

నష్టాలు తప్పట్లేదు

రొయ్యల సాగు ఏటా నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో ఉన్నాను. ఒకప్పుడు సిరుల పంట పండింది. పెట్టుబడి విపరీతంగా పెరగడంతో సాగు భారమైంది. ధనిక రైతులు మాత్రమే సాగు చేసే పరిస్థితులు ఉన్నాయి. 5 ఎకరాల సాగుకు కనీసంగా రూ.15 లక్షలు పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం ధరలను బట్టి చూస్తే పంటు రూ.10 లక్షలకు మించి వచ్చే అవకాశం లేదు.

- వైడి.నూకరాజు, ఆక్వా రైతు, తాళ్లరేవు

గ్రూప్-2, సచివాలయ నోటిఫికేషన్ ఇవ్వాలి

ఎపిపిఎస్‌సి కార్యదర్శికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



వినతిపత్రం అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న గ్రూప్-2, సచివాలయ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు డివైఎఫ్ఐ నాయకులతో కలిసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌కు విజయవాడలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఐదేళ్ల నుంచి గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల కాలేదని తెలిపారు. కాబట్టి అభ్యర్థులకు వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని కోరారు. గ్రామీణ, పేద అభ్యర్థులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాము, జి రామన్న, రాష్ట్ర నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆదాయ వివరాలు సమర్పిస్తే రెండేళ్ల జైలు

- మిథాలీ మధు స్మిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆదాయపు పన్ను చట్టం 1961 ప్రకారం ఆదాయ వివరాలను తప్పుగా సమర్పించినా, అర్హత లేని మినహాయింపులు కోరినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆంధ్రా, తెలంగాణ ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనరు మిథాలీ మధుస్మిత పేర్కొన్నారు. జైలుశిక్షతోపాటు 12 శాతం వడ్డీ, 200 శాతం పన్ను ఫెనాల్టీ రూపంలో వసూలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కార్యాలయం నుంచి ఆమె శుక్రవారం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి మీడియా ప్రతినిధులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ ప్రక్రియలో తప్పుడు క్లెయిమ్స్ చేసి రీఫండ్ పొందిన పన్ను చెల్లింపుదారులు మదింపు సంవత్సరాలు 2021-22, 2022-23కు సవరించిన రిటర్న్ దాఖలు చేసి 140(బి) సెక్షన్ ప్రకారం పన్ను చెల్లించాలని, మదింపు సంవత్సరం 2023-24 కోసం ఇప్పటికే రిటర్న్ సమర్పించిన వారు 139(5) సెక్షన్ ప్రకారం సవరించిన రిటర్న్ దాఖలు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఆంధ్రా, తెలంగాణల్లోని పలువురు ఉద్యోగులు తమకు అర్హత లేకపోయినప్పటికీ అసంబద్ధమైన మినహాయింపులు, తగ్గింపులు కోరుతూ 75 శాతం నుంచి 90 శాతం మంది రీఫండ్ తీసుకోవడానికి దరకాస్తు చేసినట్లు గుర్తించామన్నారు.

బానిసత్వానికి కేరాఫ్ అదానీ గంగవరం పోర్టు

- సిఎం దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్తా : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

విశాఖలోని అదానీ గంగవరం పోర్టులో బానిసత్వం అమలవుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోర్టు కార్మికులు విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడలోని గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. శుక్రవారంనాటి దీక్షలను వి.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నైపుణ్యంలేని ఉద్యోగాల్లో నియమించి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తుండడం దారుణమన్నారు. బేసిక్ వేతనం రూ.3,700 మాత్రమే చెల్లిస్తున్నారంటే ఇంతకంటే బానిసత్వం మరొకటి ఉండదని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం మొదటి స్థానంలోకి వచ్చిందంటే దానికి కార్మికులే కారణమని, అటువంటి వారికి అతి తక్కువ వేతనాలు చెల్లించడం దారుణమన్నారు. విశాఖ పోర్టు, స్టీల్‌ప్లాంటు పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాలనే గంగవరం పోర్టు కార్మికులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను పీడిస్తున్న అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోర్టు కార్మికుల ఉద్యమానికి సిపిఎం పూర్తి మద్దతునిస్తోందని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గంగవరం పోర్టు వస్తే జీవితాల్లో మార్పు వస్తుందనుకున్న కార్మికులకు నేడు జీవన్మరణ సమస్య ఎదురైందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాయకరావుపేట నుంచి భీమిలి వరకు మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతిందని, మత్స్య సంపద తగ్గిపోయిందని తెలిపారు. అనంతరం శిబిరం నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, నాయకులు ఎం.రాంబాబు, కొవిరి అప్పలరాజు. నమ్మి రమణ, పోరాట కమిటీ నాయకులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

డిజిపి కార్యాలయం వద్ద జనసేన మహిళల ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌పై దుష్ప్రచారం చేస్తున్న వర్రా రవీంద్రారెడ్డి, వైసిపి పెయిడ్ ఆర్టిస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం డిజిపికి వినతిపత్రం ఇచ్చేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూప నేతృత్వంలో మహిళలు డిజిపి కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలోకి అనుమతించకపోవడంతో కొద్దిసేపు పోలీసులు, మహిళల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మహిళలు కార్యాలయం ముందు ధర్నా చేశారు. దీంతో పది మంది మహిళలు లోపలికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించారు. అనంతరం మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

మోడీని సాగనంపితేనే దేశానికి రక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఐక్య ఉద్యమాల ద్వారానే తిప్పికొట్టాలన్నారు. బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, బ్యాంకులు, బొగ్గు గనులు, రైల్వేలు, ఆయిల్ కంపెనీలు, రక్షణ ఉత్పత్తులు, విద్యుత్తు, స్టీల్, పోర్టులు, విమానాశ్రయాలను ప్రైవేటు కార్పొరేట్లకు అప్పగించిన దేశ ప్రజల కష్టార్జితాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆయన విమర్శించారు. యూనిఫాం సివిల్ కోడ్ పేరుతో దేశంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి బిజెపి సిద్ధమవుతోందన్నారు. మహిళలపై బిజెపికి చిత్త శుద్ధి ఉంటే పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్న 33 శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించి తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ.. కేంద్ర కార్మిక సంఘాలు 2023 జనవరి 30న ఢిల్లీలో జరిగిన సదస్సులో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల నష్టపోతున్న కార్మికులు, రైతులు ఇతర వర్గాల పక్షాన దశలవారీ పోరాటాలకు పిలుపునిచ్చాయన్నారు. ప్రజా సంపదను లూటీ చేస్తున్న మోడీ విధానాలకు వ్యతిరేకంగా సకల కార్మికులు ఐక్యం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కూడా ఇందుకు భిన్నంగా లేవని, కేంద్రంతో లాలూచీ పడి లేబర్ కోడ్స్, విద్యుత్తు సంస్కరణల అమలుకు పూనుకుందని విమర్శించారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల సంపదను అదానీ, అంబానీలకు మోడీ దోచిపెడుతున్నారన్నారు. గతంలో చిన్న కుంభకోణాలు జరిగితే పత్రికల్లో పతాక శీర్షికల్లో వచ్చేవని, ఇప్పుడు రూ.వేల కోట్లు దోపిడీ జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అవినీతిని ప్రశ్నించేవారిపై రాజద్రోహం కింద కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఆగస్టు 9న జరిగే మహాధర్నాను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలన్నారు. సదస్సులో ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్, ఎఐటిఎఫ్‌యు లక్ష్మణరావు, ఎఐటియుసి సుధీర్, శ్రామిక మహిళా నాయకులు కె ధనలక్ష్మి, కె శైలజ మాట్లాడుతూ.. సిపిఎస్ రద్దుపై రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడుతోందని విమర్శించారు. 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కార్మికులకు జీతాలు 10, 11 ఏళ్ల క్రితం నిర్ణయించిన వేతనాలనే ఇస్తోందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని వారు డిమాండ్ చేశారు. ఎఐటియుసి కార్యదర్శి వెంకటసుబ్బయ్య సదస్సుకు హాజరైన వారికి స్వాగతం పలకగా, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్‌మహ్మద్ వందన సమర్పణ చేశారు.

'ఉక్కు'పై కుట్రలు సాగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

వాటికగా మార్చే కుట్రలకు కేంద్రం పాల్పడుతోందన్నారు. ఈ క్రమంలో ఒకవైపు ప్రయివేటీకరణకు ఉద్యమిస్తూనే, రెండోవైపు ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా ముడిసరుకు, పెట్టుబడి కోసం పోరాడాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. బిజెపి ఎంపి జివిఎల్.నరసింహారావు గురువారం ఉక్కునగరంలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని, ఏం సాధించారని ఇక్కడ జన్మదిన వేడుకలు జరుపుకుంటారని శ్రీనివాసరావు ప్రశ్నించారు. స్టీల్ యాజమాన్యం ఇటీవల బార్టర్ పద్ధతిలో ఎవరైనా వచ్చి ముడిసరుకు, పెట్టుబడి పెట్టండంటూ టెండర్లు పిలవడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. దేశంలో ఎక్కడా ప్రయివేటు రంగం సమర్థవంతంగా పనిచేసిన దాఖలాలు లేవని తెలిపారు. లాభాల కోసం కార్మికుల రక్తాన్ని జలగల్లా పీల్చివేయడమే 'ప్రయివేటు' లక్షణమన్నారు. అందుకే ప్రభుత్వ రంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రజలు, కార్మికులదేనని తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు, ప్రజలు మరింత అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్థానిక కార్మికులను నెట్టేసే విధానాన్ని అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తీసుకుందని వివరించారు. ప్రజా, కార్మిక పోరాటాలతోనే ప్రభుత్వ రంగ పరిశ్రమలను కాపాడుకోగలమన్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ జార్జి విక్టర్ మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక తీవ్ర నియంతృత్వ పోకడలు అమలవుతున్నాయని విమర్శించారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పడం కాదని, స్టీల్‌ప్లాంట్‌పై తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

పలువురు సంఘీభావం

24 గంటల ఉక్కు దీక్షకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, రైటర్స్ అకాడమీ ఛైర్మన్, లీడర్ పత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, ప్రభాకరరావు, ఐలు రాష్ట్ర నాయకులు బివి.రామాంజనేయులు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జె.అయోధ్యరామ్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ తదితర నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

చిన్న పరిశ్రమలపై విద్యుత్ భారాలు ఉపసంహరించాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు తగ్గించి మూతపడుతున్న చిన్న పరిశ్రమలను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టారిఫ్ పెంపుతో విద్యుత్ భారాన్ని మోయలేక ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలను తాత్కాలికంగా మూసివేస్తున్నారని, వాటికి ప్రధాన వనరు విద్యుత్తేనని అన్నారు. ఈ వారంలోనే రెండు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు (ఫేసర్, డెక్కన్) లాకౌట్ ప్రకటించాయని పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే 72 శాతం ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు పెరిగాయని వివరించారు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ యూనిట్‌కు ఆరు పైసలు నుండి రూపాయికి పెంచారన్నారు. లెవీ యూనిట్‌కు 85 పైసలు అదనంగా వడ్డించారని, దీనివల్ల ఇప్పటి వరకు ఉన్న విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు రూ.5 నుండి రూ.8.59కి పెరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తేనే తిరిగి నడపగలమని జిల్లా కలెక్టరు, సంబంధిత ప్రభుత్వశాఖలకు లేఖలు రాశారని, ఇప్పుడు విద్యుత్ భారాలతో రాష్ట్రంలో మొత్తం 39 ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడనున్నట్లు వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. అందులో ఒక్క విజయనగరంలోనే 16 పరిశ్రమలు ఉన్నాయని, వెనుకబడిన విజయనగరం జిల్లాలోనే గతంలో జ్యూట్ పరిశ్రమ, నేడు ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ మూతపడటంతో పారిశ్రామికంగా జిల్లా పూర్తిగా వెనుకబడుతుందని వివరించారు. ఈ ఒక్క పరిశ్రమలోనే 30 వేలమంది కార్మికులు రోడ్డున పడతారని తెలిపారు. ఇవే గాక ఇతర చిన్నతరహా పరిశ్రమలకు కూడా పెరిగిన విద్యుత్, ట్రూఅప్ భారాలతో విద్యుత్ ఖర్చు రెట్టింపవుతోందని, 2019కి ముందు యూనిట్‌కు రూ.4.95 ఉన్న ధర ఇప్పుడు రూ.7.40 అయిందని, ట్రూఅప్ ఛార్జీలు వంటివి కూడా కలిపితే ఇంకా పెరుగుతుందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్ ఛార్జీలు చాలా ఎక్కువగా ఉండడంతో రాష్ట్రంలో చిన్న పరిశ్రమలు నడపలేక మూతపడాల్సిన దుస్థితి వస్తోందన్నారు. ఈ పరిశ్రమలు మూతపడటం వల్ల వాటిల్లో పనిచేస్తున్న కార్మికుల జీవన భృతి దెబ్బతింటోందని పేర్కొన్నారు. అనుబంధ పరిశ్రమలూ మూతపడి కార్మికులు రోడ్డునపడతారని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకుంటున్నామని ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో విద్యుత్ ఛార్జీలు పెంచి మూతపడడానికి దోహదం చేస్తోందని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని రానున్న సంక్షోభాన్ని నివారించడానికి పరిశ్రమలకు చేయూతనిచ్చి ఆదుకోవాలని, చిన్న పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని, పరిశ్రమల మనుగడను కాపాడి తద్వారా ఉపాధి కోల్పోకుండా నివారించాలని కోరారు.

గర్భిణీపై వైసిపి నేతల దాడి

'జగనన్న సురక్ష'లో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-పిసిపల్లి (ప్రకాశం జిల్లా)

గర్భిణీ అని కూడా చూడకుండా వైసిపి నేతలు తనపై దాడి చేశారని ఓ దళిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలంలోని దివాకరపురానికి చెందిన దళిత మహిళ నీలం నరసమ్మ గర్భిణీ. ప్రభుత్వ పథకాల కోసం వేలిముద్ర వేయించుకునేందుకు వలంటీర్ శీలం మాధవి గురువారం ఆమె ఇంటికి వెళ్లారు. నరసమ్మ కుటుంబీకులు మురికినీళ్ళను సైడు కాలువలోకి వదులుతున్నారని, పైపులైన్ ఏర్పాటు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని అక్కడే ఉన్న వెంగళాయపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి అన్నారు. ఈ విషయమై శుక్రవారం నీలం నరసమ్మ కుటుంబ సభ్యులు వెంగళాయపల్లి సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరై గురువారం జరిగిన ఘటన గురించి అధికారులకు చెప్పేందుకు ప్రయత్నించారు. మీ సమస్యను తరువాత చర్చిద్దాం, కార్యక్రమాన్ని సాఫీగా సాగనివ్వండని వైసిపి నేత, మాజీ సర్పంచ్ శీలం సుదర్శనం కోరారు. తమకు ఇప్పుడే సమాధానం చెప్పాలని నరసమ్మ కుటుంబీకులు ప్రశ్నించారు. నరసమ్మ కుటుంబానికీ, వైసిపి నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు కుర్చీలు విసిరేసుకున్నారు. గర్భిణీ అని కూడా చూడకుండా తనపై సుదర్శనం, మరో ఏడుగురు దాడి చేశారని పిసిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నరసమ్మ ఫిర్యాదు చేశారు. వైసిపి నేతలు కూడా నరసమ్మ కుటుంబీకులపై ఫిర్యాదు చేశారు. రెండు గ్రూపులు ఇచ్చిన ఫిర్యాదులపై సెక్షన్ 160 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మాపై ఆంక్షలు ఎందుకు?

- జైభీమ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాదయాత్ర చేస్తామన్న తమపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఆంక్షలు పెడుతోందని, అధికార పార్టీ నాయకులకు లేని ఆంక్షలు ఇతర పార్టీలపై ఎందుకు? అని జైభీమ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీనగర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు జరుగుతున్న అన్యాయంపై రాజధాని అమరావతి పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చేందుకు పాదయాత్ర చేస్తానంటే అనుమతివ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. లక్షల మందితో జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలకు అనుమతిచ్చే పోలీసులు తనపై ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. మీడియాను కూడా రానీయకూడదని నిబంధనల్లో పేర్కొనడం ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమేనన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 200 మందితో పాదయాత్ర చేసి తీరుతామని, మీడియా కవరేజీ చేసుకుంటే తమను బాధ్యులను చేస్తామనడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. అనంతరం పాదయాత్రకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు.

'బర్డ్'లో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు బర్డ్ ఆస్పత్రిలో రాబోయే రోజుల్లో నెలకు 25 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు ఉచితంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిలో శుక్రవారం కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసుకున్న పిల్లలతో ఛైర్మన్ మాట్లాడారు. అనంతరం ఇఒ ఎవి.ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవి, ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లె రెడ్డెప్పరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి కొత్త జీవితం ప్రసాదించానే ఉద్దేశంతో బర్డ్ ఆస్పత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. మొదట నెలకు ఒక సర్జరీతో ప్రారంభమైన ఈ ప్రయత్నం తరువాత నెలకు మూడు దాకా చేసే స్థాయికి చేరుకుందన్నారు. వైద్యుల కృషితో కొద్ది కాలంలోనే నెలకు పది సర్జరీలు చేసే స్థాయికి చేరుకుందని వివరించారు.

హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఇసి వినయ్‌కుమార్, డాక్టర్ రాంబాబు నేతృత్వంలో ఈ సర్జరీలు నిర్వహించారని తెలిపారు. రూ.7 లక్షల నుండి రూ.14 లక్షల వరకు ఖర్చయ్యే ఈ ఆపరేషన్లను ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టిటిడి నిర్వహిస్తోన్న శ్రవణం ప్రాజెక్టులో సుమారు 120 మంది పిల్లలు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం పేర్లు నమోదు చేసుకున్నారని, దశలవారీగా ఇతరులకు కూడా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 48 మందికి విజయవంతంగా ఈ సర్జరీలు చేశారని, రాబోయే రోజుల్లో మరిన్ని సర్జరీలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు.

ఎకరాకు రూ.50 వేలు పంటల బీమా ఇవ్వాలి

- పసుపు రైతుల సమన్వయ కమిటీ కన్వీనరు జొన్నా శివశంకర్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

పసుపు రైతులకు పంటల బీమాలో ప్రభుత్వం మొండి చెయ్యి చూపించిందని, ఎకరాకు రూ.50 వేలు పంటల బీమా ఇవ్వాలని పసుపు రైతుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనరు జొన్నా శివశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పసుపు రైతుల సమస్యలు వర్ణనాతీతమని, సంవత్సరం అంతా పండించిన పంట దళారుల పాలు అవుతోందని పేర్కొన్నారు. పసుపుకు గిట్టుబాటు ధర రూ.6,700 చెప్పినా ఎక్కడా కొనలేదని తెలిపారు. క్వింటా రూ.4,500 నుంచి రూ.5,000కు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జూన్ 12 నుండి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.6,700కు కొంటామన్నా అప్పటికే పసుపు అంతా దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని తెలిపారు. రైతులు సరుకును ఆర్‌బికె వద్దకు తీసుకెళితే సవాలక్ష ప్రశ్నలతో వెనక్కు పంపించారన్నారు. 2022 డిసెంబర్లో కురిసిన వర్షాల వల్ల పసుపు దిగుబడి తగ్గిందని, 30 నుండి 30 క్వింటాళ్లు రావాల్సిన పసుపు 15 నుండి 20 క్వింటాళ్లలోపే వచ్చిందని వివరించారు. పంట చేతికొచ్చిన తరువాత ఆరబెడితే మే, జూన్ నెలలో కురిసిన వర్షాలకు తడిచి ఎర్రబారిందని చెప్పి రూ.3,000 నుండి రూ.3,500కు కొనుగోలు చేశారని తెలిపారు.

ఎకరాకు రూ.1.70 లక్షలు నుండి రూ.రెండు లక్షల వరకూ రైతులు ఖర్చు పెడితే రైతుకు ఎకరాకు రూ.లక్ష మాత్రమే వచ్చిందని, రూ.70 వేల నుండి రూ.లక్ష వరకూ నష్టపోయారని వివరించారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా పసుపుకు క్వింటాకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు పంటల బీమా ఇస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా అందులో పసుపు రైతులను విస్మరించారని పేర్కొన్నారు. వారికి ఎకరాకు రూ.50 వేలు బీమా పరిహారం ఇవ్వాలని శివశంకరరావు డిమాండ్ చేశారు.

ఉచితంపై వేటు!

- తగ్గుతున్న ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులు
- 1.41 లక్షల కుటుంబాలకు షాక్
- విద్యుత్ భారం తగ్గించుకునే పనిలో ప్రభుత్వం
- సచివాలయాల డేటాతో ఇపిడిసిఎల్ కత్తెర

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

దళిత, గిరిజన కుటుంబాలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం ఎసరుపెట్టింది. మాట తప్పను, మడప తిప్పనంటూనే చేసిన వాగ్దానాల భారాన్ని వదిలించుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోంది. నెలకు రెండు వందల యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న ప్రభుత్వం ఉచిత విద్యుత్ వినియోగదారుల సంఖ్యను తగ్గించేందుకు నిబంధనలు విధించారు. వీటికితోడు ఉచిత విద్యుత్‌ను కాలనీలకు పరిమితం చేశారు. దీంతో, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఇపిడిసిఎల్) పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 1,41,460 ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు ఉచిత విద్యుత్‌కు దూరమయ్యాయి. 2019-20లో 7,71,883 ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు ఉచిత విద్యుత్ లబ్ధి పొందగా, 2020-21 నాటికి 7,84,409కు పెరిగాయి. 2021-22 నాటికి 8,16,585 కుటుంబాలు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందాయి. ఇలా ఏటా లబ్ధిపొందుతున్న కుటుంబాలు పెరగడంతో ఆ సంఖ్యను కుదించి, సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాల ఉచిత విద్యుత్‌పై అర్హులను వడపోసే పని ఇపిడిసిఎల్ చేసింది. ఎంతచేసినా లబ్ధిదారుల సంఖ్యలో పెద్ద మార్పులేకపోవడంతో సచివాలయాలు ఇచ్చిన అర్హత జాబితా ప్రకారం ఉచిత విద్యుత్ వర్తింపజేయాలని ఆదేశించింది. సచివాలయాలు వడపోసి ఇచ్చిన జాబితా ప్రకారం... 2021-22 ఏడాది కంటే 2022-23 మార్చి 31 నాటికి 1,41,460 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందకుండా పోయింది. వాటిలో దళిత కుటుంబాలు 96,529, గిరిజన కుటుంబాలు 44,931 ఉన్నాయి.

ఇపిడిసిఎల్ పరిధిలో 2019-20 నుంచి 2022-23 వరకు ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాల ఉచిత విద్యుత్ సర్వీసులు ఇవీ..

సంవత్సరం	ఎస్‌సి సర్వీసులు	ఎస్‌టి సర్వీసులు	మొత్తం
2019-20	4,88,257	2,83,626	7,71,883
2020-21	4,98,907	2,85,502	7,84,409
2021-22	5,24,742	2,91,843	8,16,585
2022-23	4,28,213	2,46,912	6,75,125



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

పరిశ్రమల బంద్ చట్ట వ్యతిరేకం

- జీడి పరిశ్రమలను తెరిపించాలి : సిఐటియు

ప్రజాశక్తి – మందస

జీడి పరిశ్రమల బంద్ విరమించాలని, ఉపాధి కల్పించాలని, బంద్ కాలానికి వేతనాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యాన జీడి కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు.

శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని రాధాకృష్ణాపురం సారంగపురం జంక్షన్‌లో చేపట్టిన ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి తేజేశ్వరరావు మాట్లాడారు. జీడి వ్యాపారులు తమ సొంత లాభం కోసం మూసి వేసిన జీడి పరిశ్రమలను తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్మికులతో ఎటువంటి సంప్రదింపులు చేయకుండా, బంద్ కాలానికి వేతనాల కోసం ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా జీడి యాజమాన్యాలు ఈ నెల ఐదు నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు పరిశ్రమలు బంద్ చేపట్టడం చట్ట వ్యతిరేకమన్నారు. ఈ పరిశ్రమల్లో సుమారు 25 వేల మంది జీడి కార్మికులున్నారని, బంద్ ప్రకటించిన రోజులకు యాజమాన్యాలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మంత్రి సీదిరి అప్పలరాజు జోక్యం చేసుకొని జీడి పరిశ్రమల యజమాన్యాలు బంద్ విరమించేలా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు మండల కన్వీనర్ కె కేశవరావు, జిల్లా జీడి కార్మిక సంఘం నాయకులు ఎస్ సరస్వతి, జి బాలమ్మ, సిహెచ్ చంద్రావతి, కె సరస్వతి, పి పద్మావతి, టి మోహిని పాల్గొన్నారు.

నోట్ల మార్పిడి కేసులో సిఐ సహా నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో సంచలనం సృష్టించిన నోట్ల మార్పిడి కేసులో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిఐ బి.స్వర్ణలత సహా నలుగురిని అరెస్టు చేసినట్టు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నేవీ విశ్రాంత ఉద్యోగి కొల్లి శ్రీను తన రిటైర్మెంట్ ద్వారా వచ్చిన డబ్బులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామని అనుకున్నారు. తనకు తెలిసిన వారిని సంప్రదిస్తుండగా నేవీ ఉద్యోగి గోపి ద్వారా సూరిబాబు అనే వ్యక్తి పరిచయమయ్యారు. రూ.90 లక్షల విలువైన ఐదు వందల రూపాయల నోట్లకు రూ.కోటి విలువైన రెండు వేల నోట్లు ఇచ్చేందుకు వీరి మధ్య మాటలు సాగాయి. లాభం వస్తుందన్న ఉద్దేశంతో శ్రీను రూ.90 లక్షల నగదు తీసుకుని గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో సీతమ్మధారలోని ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ వెనుక ఉన్న వీధికి వచ్చారు. ఈ క్రమంలో మధ్యవర్తి సూరిబాబు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆయనతో ఆర్మ్‌డ్ రిజర్వ్ సిఐ బి.స్వర్ణలత, ఎఆర్ కానిస్టేబుల్ హేమసుందర్, హోంగార్డ్ వి.శ్రీనివాసరావు కుమ్మక్కై శ్రీనును బెదిరించారు. ఆయన నుంచి సూరిబాబు రూ.5 లక్షలు, సిఐ బి.స్వర్ణలత రూ.5 లక్షలు, హేమసుందర్ రూ.2 లక్షలు, వి.శ్రీనివాసరావు రూ.10 వేలు తీసుకున్నారు. ఈ విషయమై బాధితుడు ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.12.10 లక్షల నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కురుక్షేత్ర మహాసభ కేసులు ఎత్తివేతపై హర్షం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

టిడిపి హయాంలో గుంటూరులో జరిగిన కురుక్షేత్ర మహాసభలో పాల్గొన్న దళితులపై బనాయించిన కేసులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎత్తివేయడం పట్ల ఎంపి నందిగం సురేష్, మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నందిగం సురేష్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన తరగతుల కోసం జగన్ ప్రభుత్వం ఎన్నో పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

- కిసాన్ సభ నాయకులు విజ్జూకృష్ణన్ డిమాండ్

ప్రజాశక్తి–ఒంగోలు కలెక్టరేట్



ఒంగోలులో శుక్రవారం జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న విజ్జూకృష్ణన్

పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని, ఇందు కోసం చేసే పోరాటాల్లో అన్ని పార్టీలూ కలిసి రావాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూకృష్ణన్ డిమాండ్ చేశారు. 'వ్యవసాయ రంగ సంక్షోభం – పరిష్కార మార్గాలు' అనే అంశంపై ప్రకాశం జిల్లా ఒంగోలులోని బృందావన్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సెమినార్ శుక్రవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావున జరిగిన సెమినార్‌లో విజ్జూకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేరళలో పంటలు, కూరగాయలకు కనీస మద్దతు ధర నిర్ణయించి.. రైతులను ఆదుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వం కేరళ తరహా కనీస మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ ప్రజలకు అనేక హామీలిచ్చి విస్మరించారని తెలిపారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి నిలువునా మోసం చేశారన్నారు. 2014–2023 వరకు అప్పుల బాధతో రైతులు, పనుల్లేక రైతు కూలీలు, వలస కార్మికులు సుమారు 4 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను అమలుచేసే నాథుడు లేడన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయకపోవడంతో నష్టాలు పెరిగి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించడం ద్వారా వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులు గట్టెక్కుతారన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులలో రైతులకు సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ సంప దను లూటీ చేస్తున్న కార్పొరేట్ శక్తులను తరిమికొట్టేందుకు మేధావులు, ప్రజలు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్య క్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశంలో పాలకవర్గాలు అనుసరిస్తోన్న విధానాల కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. దీని నుంచి బయటపడి మనుగడ సాగించాలంటే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులను అమలుపరచడమే శరణ్యమని తెలిపారు. సెమినార్‌లో ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, అధ్యక్షులు రాధాకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.హనుమారెడ్డి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఆచార్య రంగా కిసాన్ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడారు.

థ్రెడ్స్‌పై కేసు వేస్తాం : ట్విట్టర్



వాషింగ్టన్ : మెటా ఆవిష్కరించిన థ్రెడ్స్ తమను కాపీ చేసిందని ట్విట్టర్ ఆరోపించింది. చట్టవిరుద్ధంగా తమ సమాచారాన్ని వినియోగించుకుని నకలు యాప్‌ను తయారు చేసిందని పేర్కొంది. దీనిపై తాము కేసు వేయనున్నామని ట్విట్టర్ హెచ్చరించింది. ఈ మేరకు ట్విటర్ అధినేత ఎలాన్ మస్క్ న్యాయవాది అలెక్స్ స్పిరో మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్‌కు లేఖ రాశారు. "మేధోపరమైన అంశాల్లో ట్విటర్ నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. ట్విటర్ వాణిజ్య రహస్యాలను, ఇతర రహస్య సమాచారాన్ని ఉపయోగించకుండా మెటా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే దీనిపై న్యాయపరంగా ముందుకెళ్లాల్సి ఉంటుంది. ట్విట్టర్ మాజీ ఉద్యోగులను మెటా నియమించుకుంది. ఆ ఉద్యోగులంతా ట్విట్టర్‌కు సంబంధించిన వాణిజ్య రహస్యాలు, ఇతర అత్యంత గోప్యమైన సమాచారన్ని కలిగి ఉన్నారు." అని స్పిరో పేర్కొన్నారు. ఆరోపించారు. ఈ పరిణామాలపై ట్విట్టర్ బాస్ ఎలన్ మస్క్ స్పందిస్తూ.. 'పోటీ మంచిదే.. మోసం కాదు' అని అన్నారు. థ్రెడ్స్ వచ్చిన 24 గంటల్లోనే దాదాపు 5 కోట్లకు పైగా డౌన్‌లోడులు నమోదయ్యాయి.

ఫెర్రో పరిశ్రమలు మూసేయొద్దు : బొత్స

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లాలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, యాజమాన్యాలు తొందరపడి లాకౌట్ ప్రకటించవద్దని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లా పరిషత్తు సమావేశానంతరం శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పొందిన లాభాల నుంచి నష్టాలను పూడ్చుకొని నిర్వహణను కొనసాగించాలని, అప్పటికీ నష్టాలొస్తే సహాయం అందించే విషయం పరిశీలిస్తామని తెలిపారు. ప్రభుత్వ విధానం ప్రకారం ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్తు రాయితీ, పంపిణీ ఉంటుందని, యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సహకార రంగ పరిశ్రమలను ప్రభుత్వం మూసివేస్తుందా? అని విలేకరి అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. చెరకు మద్దతు ధర లేకపోవడం వల్ల రైతులు పంట సాగు తగ్గించారని, సామర్థ్యానికి తగ్గట్టు చెరకు ఉత్పత్తి లేకపోవడం వల్ల భీమసింగి చక్కెర ఫ్యాక్టరీ నిర్వహణ సాధ్యం కాలేదన్నారు. లక్షకు పైగా ఎకరాల్లో చెరకు పండించాల్సి ఉండగా ప్రస్తుతం 20 వేల ఎకరాల్లోనే చెరకు సాగవుతోందని, రైతులు తగినంత చెరకు పండిస్తే ఫ్యాక్టరీని నడపడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పారు. ప్రస్తుతం చెరకు రైతులకు ఇబ్బంది లేకుండా సంకిలి చక్కెర కర్మాగారంలో క్రషింగ్ చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సహకార రంగ పరిశ్రమలను మూసివేసిన ఘనత చంద్రబాబుదేనని ఆక్షేపించారు.

జెన్‌కో పనితీరు భేష్ : అంజుబాల

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

రిజర్వేషన్ల అమలు, ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఎపి జెన్‌కో పనితీరు బాగుందని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు అంజుబాల ప్రశంసించారు. జెన్‌కో కార్యాలయంలో కమిషన్ అధికారులతో కలిసి ఎస్‌సి అసోసియేషన్ ఉద్యోగులతో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఉద్యోగుల నుంచి వచ్చిన వినతిపత్రాలు, ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. యాజమాన్యం తీరును అభినందిస్తూ జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబుకు ప్రశంసాపత్రం అందజేశారు. కమిషన్ తరపున రాష్ట్రపతికి కూడా సిఫార్సు చేస్తామని తెలిపారు.

నేడు కళ్యాణదుర్గానికి ముఖ్యమంత్రి

- రూ.1117 కోట్లు పంటల బీమా పంపిణీ

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్త రైతు దినోత్సవ కార్యక్రమం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో శనివారం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10.2 లక్షల మందికి రూ.1117 కోట్ల బీమా మంజూరైంది. రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బటన్ నొక్కి ప్రారంభిస్తారు. శనివారం ఉదయం 9.50 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం పట్టణానికి చేరుకుంటారు. అక్కడ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా మంత్రి ఉష శ్రీచరణ్, కలెక్టర్ గౌతమి తదితరులు పరిశీలించారు.

కడపలో మూడు రోజుల పర్యటన

కడప జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మూడు రోజులు పర్యటించనున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా శనివారం మధ్యాహ్నం ఇడుపులపాయకు చేరుకుంటారు. నివాళులర్పించిన అనంతరం రాత్రికి పులివెందులలో బస చేయనున్నారు. ఆదివారం, సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం తిరిగి విజయవాడకు చేరుకుంటారు.

సంపాదకీయం

మనువాదుల అకృత్యాలు

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉత్తర భారతావనిలో దిగ్భ్రాంతికరమైన, జుగుప్సాకరమైన దారుణాలు నిత్యకృత్యంగా మారాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రత్యేకించి దళితులను, గిరిజనులను, మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని సంఘ్ పరివార్ గూండాలు అత్యంత దారుణాలకు ఒడిగడుతున్నారు. రెండు రోజుల కిందట మధ్యప్రదేశ్‌లో ఇలాంటి దారుణమే చోటుచేసుకుంది. కష్టపడి పనిచేసినందుకు కూలి డబ్బులు అడిగిన నేరానికి ఒక ఆదివాసీ యువకుడి ముఖంపై ప్రవేశ్ శుక్లా అనే సంఘ్ పరివార్ దుండగుడు మూత్రం పోసి అవమానించాడు. సిద్ధికి జిల్లాకు చెందిన పెత్తందారు, బిజెపి ఎమ్మెల్యే కేదార్‌నాథ్ శుక్లాకు ఈ ప్రవేశ్ శుక్లా ముఖ్య అనుచరుడు. దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తంకావడంతోనే జాతీయ భద్రత చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాల కింద దుండగుణ్ని అదుపులోకి తీసుకున్నారు. కానీ గుజరాత్ మారణకాండ, అత్యాచారాల కేసుల్లో దోషులను శిక్ష పూర్తికాకుండానే విడుదల చేసి సన్మానాలు చేసిన దుర్మార్గుల పాలనలో ఈ దుండగులకు శిక్ష పడుంతుందన్న గ్యారెంటీ లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూలంగా మారుతుందనే ప్రవేశ్ శుక్లాపై కేసు నమోదు చేశారే తప్ప.. బడుగులపై దాష్టీకాలను అడ్డుకోవాలనే చిత్తశుద్ధితో కాదన్నది జగమెరిగిన సత్యం. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గురువారం బాధిత గిరిజన యువకుడి కాళ్లు కడిగి నాటకాన్ని మరింత రక్తికట్టించింది కూడా ఇందుకే. జాతీయ నేరాల నమోదు సంస్థ గణాంకాల ప్రకారం..దేశంలో షెడ్యూల్డ్ తెగలపై అత్యధిక అఘాయిత్యాలు జరుగుతున్న రాష్ట్రం మధ్యప్రదేశ్. ఇదే రాష్ట్రంలో నెలరోజుల కిందట అంటరానితనం అమానుషం అని బోధించాల్సిన ఉపాధ్యాయుడే పాఠశాలలోని కుండలో నీళ్లు తాగిన దళిత బాలుడిని చితకబాది హత్య చేశాడు. సంఘ్ పరివార్ క్రూరత్వాన్ని చాటే ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు. అక్రమ కేసుల బనాయింపుతో మధ్యప్రదేశ్ జైళ్లలో మగ్గుతున్నవారిలో 58 శాతం మంది దళితులే. పెత్తందారీ దుండగులు ఎంతటి తీవ్రమైన నేరాలకు పాల్పడినా..శిక్షలు పడిన దాఖలాలు చాలా అరుదనే చెప్పాలి. మధ్యప్రదేశ్ ఒక్కటే కాదు..ఉత్తరప్రదేశ్, గుజరాత్ ఇలా బిజెపి పాలిత ప్రతి రాష్ట్రంలోనూ పెత్తందారీ సామాజిక తరగతులదే రాజ్యం. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇటీవల కాలంలో దళితులపై పెత్తందార్ల దాడులు పెరిగిపోతున్నాయి. కేంద్రం తీసుకొస్తున్న వినాశకర సంస్కరణలకు జీ హూజూర్ అంటున్న ఇక్కడి వైసిపి ప్రభుత్వం దళితులు, గిరిజనులపై దాడుల విషయంలోనూ అదే తీరును అనుసరిస్తుండటం సిగ్గుచేటు.

భారత రాజ్యాంగాన్ని, దాని విలువలను కాపాడుతూ సబ్ కా సాత్..సబ్ కా వికాస్ అంటూ అందరి బాగోగులకు కోసం బిజెపి ప్రభుత్వం పరితపిస్తోందంటూ విదేశీ పర్యటనల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గొప్పలు చెబుతుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఎన్ని అఘాయిత్యాలు జరిగిపోతున్నా..నోరు మెదపరు. చట్టసభల్లో నిలదీసి అడిగినా..మౌనముద్ర వీడరు. 2017లో రామ్‌నాథ్ కోవింద్‌ను, 2022లో ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా చేసి దళితులకు, గిరిజనులకు పట్టాభిషేకం చేశామంటూ ఎన్నికల్లో ప్రచార జిమ్మిక్కులకు పాల్పడుతున్న బిజెపి క్షేత్రస్థాయిలో అదే దళితులు, గిరిజనులపై క్రూర దాడులకు తెగబడుతోంది. పార్లమెంటు నూతన భవనాన్ని ఘనంగా ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మనుస్మృతి సామాజిక దొంతరలో గిరిజనులు అట్టడుగునున్నందునే ఆ కార్యక్రమానికి దేశ ప్రథమ పౌరురాలైన ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా అవమానించారన్న విమర్శలు కాదనలేనివి.

సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర మౌలిక లక్షణాలతో సమ సమాజ ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్న భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి..ఆ స్థానంలో మనువాద ఉన్మాద స్మృతిని తీసుకురావాలని బిజెపి ఒక పథకం ప్రకారం యత్నిస్తోంది. ఇప్పటికే విశ్వవిద్యాలయాలు, కేంద్ర సంస్థలు, శాస్త్ర, పరిశోధనా సంస్థల్లో పాలక మండళ్లను సంఘ్ పరివారంతో నింపేశారు. శాస్త్ర పరిశోధనలకు అందజేసే అవార్డులను నిలిపేశారు. విజ్ఞాన శాస్త్రాలను నిషేధించేందుకూ వెనుకాడబోరు. ఇప్పటికే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశం నుంచి తొలగించారు. సంఘ్ పరివారాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తూ దళిత, ఆదివాసీ యువతపై కేంద్రీకరించి వారిలో బూజుపట్టిన మనువాద భావాలను నింపుతున్నారు. అణగారిన ప్రజల మధ్య చిచ్చు రాజేసి వారిపై వారినే ఉసిగొల్పే అత్యంత దారుణమైన కుట్రలను సంఘ్ పరివార్ కొనసాగిస్తోంది. మణిపూర్‌లో హింసాకాండకు కూడా ఈ విచ్ఛిన్నకర ఎజెండాయే కారణం. రాజకీయ లబ్ధి కోసం ప్రజల్లో కుల, మత, ప్రాంత విద్వేషాలు రెచ్చగొట్టి ఇటు జాతి వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే వినాశకర విధానాలను అవలంబిస్తున్న బిజెపిని, దాని విధానాలకు జీహుజూర్ అంటున్న పార్టీలకు తగిన శాస్తి చేస్తేనే దేశ ప్రజలకు మనుగడ.

మహనీయుల మాట



ఒక అవకాశం చేజారిపోతే
కళ్ళ నీళ్లు పెట్టుకోకు.
మరొక అవకాశం
చేజారి పోకుండా జాగ్రత్తపడు.
- అబ్రహం లింకన్

అంతర్ధానమవుతున్న మాతృభాషలు

విశ్లేషణ



గణేష్ దేవీ

మనిషి తన తల్లికి ఎంత దగ్గరగా ఉంటాడో మాతృభాషకు కూడా అంత దగ్గరగా ఉంటాడు. పిల్లవాడు, తన భాషా సామర్థ్యాన్ని తల్లి నుండి నేర్చుకుంటాడు. ఏ తల్లీ కూడా అప్పుడే పుట్టిన పిల్లాడికి ఎలాంటి వ్యాకరణ నిబంధనల్ని బోధించదు. అయినా, తన తల్లి పెదాల కదలికలు, ఆమె అభినయాలను గమనించడం ద్వారా, ఆమె మాటల ధ్వని, ఆ మాటల కూర్పును గ్రహించడం ద్వారా ఆ పిల్లాడు అంత సంక్లిష్టమైన నిబంధనల్ని వంటబట్టించుకుంటాడు. పిల్లలు భాషలను పాఠశాలలో నేర్చుకుంటారనే ఒక విస్తృతమైన తప్పుడు అభిప్రాయం ఉంది. అది మాతృభాషేతర భాషల విషయంలో వాస్తవం కావచ్చు. ద్వితీయ, తృతీయ లేక ఇతర భాషల్ని వ్యాకరణం, అనువాదం ద్వారా నేర్చుకోవాల్సి ఉంటుంది. కానీ పిల్లవాడు మూడు సంవత్సరాల వయసొచ్చే సమయానికి మాతృభాష లోని దాదాపు అన్ని సంక్లిష్టతలను నేర్చుకోవడానికి అనుగుణంగా మెదడు నిర్మితమై ఉంటుంది. లేఖనం (రాత) అనేది వేరే అంశం. కొన్ని లక్షల సంవత్సరాల మానవ జాతి చరిత్రలో, లేఖనం అనేది ఏడు వేల సంవత్సరాల క్రితమే వ్యక్తీకరణకు, సమాచారాన్ని అందించే, జ్ఞాపకాలను నిల్వ చేసే సాధనంగా మారింది. భాష అంటే ప్రాథమికంగా మాట్లాడటం. లేఖనం ద్వారా తరాల మధ్య సుదీర్ఘ కాలంపాటు భాషాపరమైన సంబంధ బాంధవ్యాలకు అవకాశం ఇవ్వడం భాషకుండే అదనపు లక్షణం.

నా బాల్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మాతృభాష కాని ఇతర అనేక భాషలను వారాంతపు సంతల్లో జన సమూహాలు మాట్లాడడం స్వయంగా విన్నాను. అప్పట్లో రేడియో అనేది మా గ్రామంలో ఓ కొత్త యంత్ర పరికరం. ఇంట్లోకి కొత్త రేడియో సెట్ రావడంతో నేను ఎంతో ఆసక్తిగా స్టేషన్లను కదిలిస్తుండేవాణ్ని. వారాంతపు సంతల్లో వినని అనేక భాషల్ని రేడియోలో విన్నాను. దీంతో అసలు ఈ ప్రపంచంలో ఇంకా ఎన్ని భాషలు ఉన్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి నాలో పెరిగింది.

1970లో ఒక విశ్వవిద్యాలయం విద్యార్థిగా భారతీయ భాషలపై జనగణనకు సంబంధించిన చిన్న పుస్తకాన్ని చూశాను. దానిలో 109 భాషల జాబితా ఉంది. ఆ జాబితాలో చివరన "అన్ని ఇతర భాషలు" అని ఉంది. అంటే 108 భాషల కన్నా ఎక్కువ భాషలు ఉన్నాయనే దానికి ఇదొక సూచిక. ఇంతకన్నా ముందుగా జనాభా లెక్కల్లో మరికొన్ని వివరాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతో యూనివర్శిటీ లైబ్రరీలో 1961 జనాభా గణాంకాల కోసం వెతికాను. ఆ గణాంకాలలో నేను దిమ్మతిరిగే విషయాలను గమనించాను. ఆ జాబితాలో 1652 భాషల్ని తమ మాతృభాషగా భారతీయులు పేర్కొన్నారు. పైన ఉదాహరించిన భాషల గణాంకాలకు సంబంధించి రెండు రకాల సంఖ్యల్ని పోల్చితే 10 సంవత్సరాల కాలంలో (అంటే 1961-1971 మధ్య కాలంలో) భారతదేశం మొత్తం 1544 భాషల్ని కోల్పోయింది.

భాషా గణనను మామూలు అంక గణితం ద్వారా విభజించలేం. దానికి శిక్షణ పొందిన భాషా పండితుల పరిశీలన అవసరం ఉంటుంది. అందువలన భారతీయ జనగణన రిజిస్ట్రార్ దగ్గర పని చేస్తున్న భాషా పండితులు, విద్యావిషయక నిష్ణాతుల సాహిత్యంలో నమోదుచేయబడిన మాతృభాషల పేర్లు (జనాభా లెక్కల సమయంలో ప్రజలు చెప్పినవి) ఏమైనా ఉన్నాయేమోనని అందుబాటులో ఉన్న గ్రంథాలయాలలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది. దీనికి ఖచ్చితంగా సమయం తీసుకుంటుంది. అందువల్ల సాధారణంగా భాషకు సంబంధించిన గణాంకాలను చివరగా ప్రకటిస్తారు.

1971 భాషా గణనకు, భాషా గణాంకాల ప్రకటన మధ్య కాలంలో బంగ్లాదేశ్ యుద్ధం జరిగింది. తరువాత కాలంలో బంగ్లాదేశ్‌గా మారిన తూర్పు పాకిస్తాన్, పశ్చిమ పాకిస్తాన్ నుండి భాషా సమస్య పైనే విభజనను కోరింది. భారత ప్రభుత్వం భాషా వైవిధ్యం గురించి ఆందోళన చెంది, భాషల సంఖ్యను తగ్గించే మార్గాలను వెతికే నిర్ణయం చేసి వున్నట్లైతే, అది సహజమేనని భావించాలి. అందుకుగాను ప్రభుత్వం "పది వేల (భాషను మాట్లాడే వారి సంఖ్య) సంఖ్య" పరిమితిని విధించింది. ఈ సంఖ్యా పరిమితికి ఎలాంటి శాస్త్రీయమైన పునాది లేదు. ఒక భాషను భాషగా పరిగణించాలంటే ఆ భాషను మాట్లాడేవారు కేవలం ఇద్దరుంటే చాలు. 1970 ప్రాంతంలో 1544 "మాతృభాషలు" ఆకస్మికంగా మౌనం వహించాయా? కచ్చితంగా కాదు. అవి కొద్ది జనాభా ఉన్న భౌగోళిక ప్రాంతాల్లో కొనసాగాయి.

ప్రభుత్వం కృత్రిమంగా విధించిన సీలింగ్ కారణంగా వాస్తవానికి ఎన్ని భాషలు అంతర్ధానయ్యాయో తెలుసుకోవాలంటే 1971 జనగణనను 2011 జనగణనతో పోల్చి చూడాలి. ప్రజలు తమ మాతృభాషగా పేర్కొన్న భాషల్ని లెక్కించడానికి అదే జనగణన పద్ధతిని అనుసరించగా భారతదేశంలో ప్రజలు 1369 భాషలను మాట్లాడుతున్నట్లు 2011 జనగణన నిర్ధారించింది. రెండు సంఖ్యలను పోల్చి చూడడం ద్వారా 1961 నుండి 2011 వరకు...అంటే 50 సంవత్సరాల్లో (1,652-1,369=283) 283 భాషలు అంతరించి పొయ్యాయనే నిర్ధారణకు ఎవరైనా రావచ్చు. అంటే సంవత్సరానికి సగటున నాలుగు లేక ఐదు భాషలు లేదా ప్రతీ రెండు లేక మూడు నెలలకొక భాష అంతరించినట్టు అర్థం చేసుకోవాలి. గతంలో ఓ వెయ్యి సంవత్సరాల పాటు "అంతర్ధానమైన" భాషలు ఉనికిలో ఉన్నాయనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, భారత దేశంలో భాషల అంతర్ధాన రేటు గుండెలు అదిరిపోయే విధంగా ఉంది. జనగణన "మాతృభాషలనే" మాటను ఉపయోగించినప్పుడు, వాటిలో చిన్న లేదా అల్ప సంఖ్యాక భాషలు మాత్రమే కాక అధిక సంఖ్యాక భాషలు కూడా ఉన్నాయనే విషయం ఎవరికైనా అంత తేలిగ్గా స్ఫురణకు వస్తుందనుకోలేం.



> **విచారకరమైన నిర్ధారణ ఏమంటే భారతీయులు మాట్లాడే అల్ప సంఖ్యాక, అధిక సంఖ్యాక భాషలన్నీ (హిందూత్వ భావజాలాన్ని అనుసరించేవారు ఇష్టపడే భాషలను మినహాయిస్తే) నేడు వాటి ఉనికికి సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మన రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా బహు భాషలు మాట్లాడే వివిధ రాష్ట్రాల సమాఖ్యగా ఉన్న భారత దేశానికి ఇది మంచిది కాదు.**

భారతదేశ ప్రజలు మాట్లాడిన వివిధ భాషల వివరాలు దశాబ్దాల వారీగా చూస్తే, 1961లో బంగ్లా మాట్లాడేవారు మొత్తం జనాభాలో 8.17 శాతం ఉండగా అర్ధ శతాబ్దం తరువాత వారి సంఖ్య 8.03 శాతానికి తగ్గింది. మొత్తం జనాభాలో మరాఠీ భాష మాట్లాడేవారి సంఖ్య 7.62 శాతం నుండి 6.86 శాతానికి, తెలుగు మాట్లాడేవారు 8.16 శాతం నుండి 6.70 కి, తమిళం మాట్లాడే వారి సంఖ్య మరీ దారుణంగా 6.88 శాతం నుండి 5.70 శాతానికి దిగజారింది. వాస్తవానికి హిందీ భాష తరువాత ఎక్కువగా మాట్లాడే మొదటి ఎనిమిది భాషలు-బంగ్లా, మరాఠీ, తెలుగు, తమిళం, గుజరాతీ, ఉర్దూ, కన్నడం, ఒడియా మొత్తం జనాభాలో 2011 జనగణన ప్రకారం 42.37 శాతం కాగా హిందీ ఒక్కటే 43.63 శాతంగా నమోదైంది. హిందీ మాట్లాడేవారి సంఖ్య ఎప్పుడూ పెరుగుతూనే ఉంది. 1961లో 36.99 శాతంగా నమోదైన హిందీ మాట్లాడే వారి సంఖ్య 2011 నాటికి మొత్తం జనాభాలో 43.63 శాతానికి పెరిగింది. హిందీ, సంస్కృతం, గుజరాతీ భాషలను మినహాయిస్తే మిగిలిన గుర్తించబడిన అన్ని భాషల అంతర్ధానం కొనసాగుతూనే ఉందని 2011 జనగణన తెలియజేస్తుంది. 1961లో సంస్కృత భాషను మాతృభాషగా పేర్కొన్న వారి సంఖ్య 2,212 మంది కాగా 2011 లెక్కల్లో ఆ సంఖ్య 11 రెట్లు పెరిగింది. అంటే ఆ సంఖ్య 24,821కి పెరిగింది. 2011లో జరిగిన భాషా గణన వివరాలను 2018లో ప్రకటించారు.

తమిళ భాష ప్రపంచంలోనే అత్యంత పురాతన జీవభాషగా ఉంది. కన్నడం, మరాఠీ భాషలు సుమారు రెండు వేల సంవత్సరాలుగా, మలయాళం, బంగ్లా, ఒడియా భాషలు కూడా దాదాపు 1000 సంవత్సరాలుగా జీవభాషలుగా ఉంటున్నాయి. సంస్కృతం దాదాపు వెయ్యి సంవత్సరాలకు పైగా జీవభాషగా లేకుండా నిలిచిపోయింది. దీనికి భిన్నంగా 17వ శతాబ్దంలో భారతదేశానికి వచ్చిన ఇంగ్లీష్ భాష అందరి అంగీకారం పొందింది. దీనిని మాట్లాడే వారి సంఖ్య జనగణనలో 2,59,878గా చూపబడింది. ఇంగ్లీష్ దినపత్రికల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. భారతదేశంలో ఏడు లక్షల గ్రామాల్లో, రెండు వేల నగరాలు, పట్టణాల్లో ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలు నిర్వహించబడుతున్నాయి. ఇంగ్లీష్ టీవీ ఛానళ్ల రేటింగ్ పాయింట్లు కూడా పెరిగిపోతున్నాయి. అసలు ఇంగ్లీష్ మాట్లాడే వారి సంఖ్య (సంస్కృతం మాట్లాడే వారి సంఖ్యకు భిన్నంగా) పెరుగుతుండడం నిజమే అని తెలుస్తుంది.

విచారకరమైన నిర్ధారణ ఏమంటే భారతీయులు మాట్లాడే అల్ప సంఖ్యాక, అధిక సంఖ్యాక భాషలన్నీ (హిందూత్వ భావజాలాన్ని అనుసరించేవారు ఇష్టపడే భాషలను మినహాయిస్తే) నేడు వాటి ఉనికికి సంబంధించిన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మన రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా బహు భాషలు మాట్లాడే వివిధ రాష్ట్రాల సమాఖ్యగా ఉన్న భారత దేశానికి ఇది మంచిది కాదు.

('ఫ్రంట్‌లైన్' సౌజన్యంతో)

(వ్యాసకర్త ఒబైడ్ సిద్ధిఖీ చైర్ ప్రొఫెసర్, నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరు)

కార్మిక నేత, ప్రజాబంధు కా॥ జ్యోతిబసు

నివాళి



నేడు జ్యోతిబసు జయంతి

భారతదేశ రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన ప్రజా నాయకుడు, కష్టజీవుల పక్షపాతిగా జీవితాంతం పోరాడిన శ్రామిక నేత జ్యోతిబసు. నేడు ఆ మహనేత 109వ జయంతి. 1914 జులై 8న జ్యోతి కిరణ్ బసు మధ్య తరగతి కుటుంబంలో జన్మిం చారు. బసు తండ్రి హోమియోపతి వైద్యం చేసేవారు. వారి కుటుంబం నాటి స్వాతంత్ర్యోద్యమానికి అండగా ఉండేది.

సూర్యసేన్ నాయకత్వాన సాగిన చిట్టగాంగ్ సాయుధ పోరాటం, జ్యోతిబసుకు విద్యార్థి దశలో స్ఫూర్తినిచ్చింది. ఉన్నత చదువులకు బసు లండన్ వెళ్ళారు. అక్కడ గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పరిచయం ఏర్పడింది. వారి ప్రభావంతో అక్కడ శ్రామిక పోరాటాలలో పాల్గొన్నారు. యువకుడైన బసుపై ఆ పోరాటాలు చెరగని ముద్ర వేశాయి. స్వదేశానికి తిరిగి రాగానే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరాలనే తలంపుకు నాంది అక్కడే పడింది.

బారిష్టరు చదువు పూర్తిచేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన బసు కలకత్తా కోర్టులో లాయర్‌గా నమోదు చేసుకున్నారు. అయినా లాయర్‌గా ప్రాక్టీసు చెయ్యకుండా కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం పూర్తి కాలం కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకున్నారు. 1940లలో ఫాసిస్టు వ్యతిరేక రచయితల సంఘానికి కార్యదర్శిగా పని చేశారు. 1944లో రాష్ట్రంలో ఏర్పడ్డ రైల్‌రోడ్ వర్కర్స్ యూనియన్‌కు కార్యదర్శిగా ఎన్నికై ప్రత్యక్షంగా కార్మికోద్యమాలలో పాల్గొనసాగారు. 1946లో అదే రైల్వే వర్కర్స్ నియోజకవర్గం నుండి చట్టసభకు ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యేంతగా ఆ ఉద్యమంతో మమేకమయ్యారు. అప్పటి నుండే కార్మిక ఉద్యమాన్ని బలోపేతం చెయ్యటానికి చట్ట సభలను ఎలా వినియోగించుకోవచ్చో ఆయన ఆచరణలో తెలియచేశారు.

బెంగాల్ తెభాగా ఉద్యమ కాలంలో జ్యోతిబసు ముఖ్య పాత్ర వహించారు. స్వతంత్ర భారతదేశంలో 11 సార్లు అసెంబ్లీకి ఎన్నికైన ప్రజా ప్రతినిధి బసు. జ్యోతిబాబుగా బెంగాల్ ప్రజలు ఆయనను ఆప్యాయంగా పిలుచుకునే వారు. 1977లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జ్యోతిబసు 2000లో స్వచ్ఛందంగా ఆ పదవి నుండి తప్పుకున్నారు. 24 సంవత్సరాలు పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రమజీవుల కోసం ఆయన అనేక చర్యలు చేపట్టారు. భూసంస్కరణలు చేపట్టి పేదలకు భూపంపిణీ చెయ్యడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు చేశారు. గ్రామ పంచాయితీలకు అధికారాలు కట్టబెట్టి, నిధులు అందచేసి స్థానిక సంస్థలలో నిజమైన ప్రజాస్వామ్యాన్ని అమలు చేశారు. తద్వారా ఆ యా గ్రామాల ప్రజల అవసరాలు తీరి అభివృద్ధి చెంది నిజమైన గ్రామ స్వరాజ్యాలుగా మారాయి. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటాలకు అండగా ప్రభుత్వం ఉండేది. కార్మికుల పోరాటాలలో పోలీసుల జోక్యం ఉండేది కాదు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం జరిగే పోరాటాలకు అండగా ఆయన నిలబడేవారు. ఒక వామపక్ష ప్రభుత్వం ప్రజావసరాలు తీర్చేట్లు, ఉద్యోగ కార్మిక హక్కుల పరిరక్షణకు ఎలా పాలన చేస్తుందనేది జ్యోతిబసు ఆచరించి చూపారు. ఆ పాలన ప్రజా మన్నన పొందింది. ప్రజాబంధుగా ఉన్న జ్యోతిబసుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించినా ఆయన సున్నితంగా తిరస్కరించారు.

సిఐటియు సంస్థాపక సమావేశాలు 1970 మే లో కామ్రేడ్ జ్యోతిబసు ఆధ్వర్యంలో కలకత్తాలో జరిగాయి. "కార్మిక వర్గం ఐక్యం కావటానికే ఉన్న సంఘం వీడి, సిఐటియు ఏర్పాటు చేశా"మని నాటి బహిరంగ సభలో చైతన్య పూరిత ప్రసంగం చేశారాయన. అఖిల భారత ఉపాధ్యక్షునిగా సేవలు సైతం అందించారు. తెభాగా పోరాటం, చైనా యుద్ధ కాలం, ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపారు. రెండు సార్లు రాజకీయ దుండగుల దాడిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 1970లలో పాట్నా రైల్వే స్టేషన్‌లో తుపాకి ద్వారా ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఆయనకు స్వాగతం పలకటానికి వెళ్ళిన బీమా ఏజెంట్ ఆ కాల్పుల్లో చనిపోయారు. ఎమర్జెన్సీ కాలంలో బెంగాల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం సాగించిన ఫాసిస్టు బీభత్సకాండను...ప్రజలతో మమేకమై ఎదుర్కొన్నారు. 1990లలో దేశంలో మతం పేరిట ఉద్రిక్తతలు సృష్టించటానికి ఉన్మాదులు ప్రయత్నించినా, బెంగాల్‌లో వాటికి తావు లేకుండా చేశారు. 1964లో సిపిఐ(ఎం) ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నవరత్న నేతలలో జ్యోతిబసు ఒకరు. ఏడు దశాబ్దాల పాటు శ్రామిక పోరాటాలలో ప్రజా ఉద్యమాలతో మమేకమైన జ్యోతిబసు 2010 జనవరి 17న కన్నుమూశారు.

కార్పొరేట్లకు సాగిలపడి సహజ వనరులను, జాతి సంపదను ప్రైవేట్ పరం చేస్తున్న పాలకులు, మతం కులం వంటి విభజిత వాదాలతో ప్రజల మధ్య అనైక్యత సృష్టిస్తున్న శక్తులు, తిరోగమన భావజాలంతో నడుస్తున్న ప్రభుత్వాలు ఉన్న పరిస్థితులలో... జ్యోతిబసు నమ్మిన కార్మికవర్గ సిద్ధాంతం, చేసిన కార్యాచరణ మాత్రమే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపగలవు. కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం, సామాజిక మార్పు కోసం ఆయన తన జీవిత కాలం కృషి చేసిన బాటలో కొనసాగి...ఆ లక్ష్య సాధన కోసం పని చేస్తామని ప్రతినబూనటమే మనం ఆయనకిచ్చే నివాళి.

- ఎం.వి. సుధాకర్,
సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు, సెల్ : 9490098414

ఫార్మా పరిశ్రమలు మృత్యు కుహరాలు!

సమస్య



అల్లు రాజు

ప్రాణాధార మందులు తయారుచేసే ఫార్మా పరిశ్రమలు...అక్కడ పనిచేసే ఉద్యోగులు, కార్మికుల ప్రాణాలను తోడేసే మృత్యు కుహరాలుగా మారడం దారుణం. యాజమాన్యాల తప్పిదాలు, తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన పలు విభాగాల అధికార యంత్రాంగం వైఫల్యాలు విలువైన ప్రాణాలను బలిగొంటున్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లోని సాహితీ ఫార్మా ల్యాబ్‌లో చోటుచేసుకున్న తాజా ప్రమాదం ఆరుగురిని బలిగొనడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం, మంటలను అదుపుచేసే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది ముగ్గురు తీవ్రంగా గాయపడడం బాధాకరం.

రక్షణ లేని జీవితాలు

యాజమాన్యాల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా ప్రమాదాలకు అధిక కారణంగా నిలిచే రియాక్టర్లు బాంబుల్లా పేలుతున్నాయి. ఇక్కడ నిపుణులైన కార్మికులు పనులు చేయాల్సి ఉండగా కనీస అవగాహన లేని టెంపరరీ, కాంట్రాక్ట్ కార్మికుల చేత పనులు చేయిస్తున్నారు. వారు రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్ల జరుగుతున్నాయి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే చికిత్స కోసం తరలించేందుకు అంబులెన్స్ లాంటి వాహన సౌకర్యాలు లేక నగరానికి చేరే లోపు మరణించిన ఘటనలు కోకొల్లలు. స్థానికంగా విధులు నిర్వహించే వారిలో అధికంగా స్థానికేతరులే ఉండడంతో వారి తరపున పరిశ్రమల యాజమాన్యాలపై పోరాటం చేసేవారు లేక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు.



> **ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట ప్రభుత్వ శాఖల నుండి జరగవలసిన తనిఖీలు దాదాపుగా నిలిపివేశారు. దాంతో కంపెనీల ఇష్టారాజ్యంగా ఉంది. ఫార్మా పరిశ్రమల్లో వినియోగించే హానికరమైన రసాయనాలపై ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించడం, రక్షణ పరికరాలు సమకూర్చడం తదితర చర్యలన్నింటినీ పరిశ్రమలు గాలికొదిలేశాయి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయడం, పర్యావరణ పరిరక్షణకు, వాతావరణంలో విష వాయువుల మోతాదును తగ్గించడానికి గ్రీన్ బెల్ట్‌ను ఏర్పాటు చేయడం, రహదారులను నిర్మించడం వంటివి ఎక్కడా కానరావడంలేదు.**

అనకాపల్లి జిల్లా పరిధిలోనే 2019 నుండి 2023 జులై వరకు జరిగిన 44 ప్రమాదాల్లో 17 మంది మరణించగా, 53 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఇవన్నీ అధికారికంగా నమోదైన కేసులు కాగా బయటకురాని సంఘటనలు అనేకం ఉంటాయి. అచ్యుతాపురం సెజ్‌లో బ్రాండిక్స్ సీడ్స్ విభాగంలో 2022 జూన్ 3న, ఆగస్టు 2న విషవాయువు లీకై 500 మందికిపైగా మహిళా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదంపై కమిటీ ఇచ్చిన నివేదికను బయటపెట్టలేదు. ఈ ఘటనను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) సుమోటాగా తీసుకొని కార్మికులకు లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని వెల్లడించింది. దీనిని కూడా ఆ కంపెనీ యాజమాన్యం అమలు చేయడానికి నేటికీ మీనమేషాలు లెక్కిస్తోంది. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించాల్సిన యాజమాన్యాలు తమ లాభాల కోసం వెంపర్లాడడం కార్మిక ద్రోహం.

పర్యవేక్షణకు నోచుకోని డిపార్టుమెంట్లు

పరిశ్రమల్లో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫైర్ డిపార్ట్‌మెంట్, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు నివేదికలను రూపొందించి, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడం మినహాయిస్తే ప్రమాద కారణాలపై నివేదికలను విడుదల చేసిన పరిస్థితి కూడా లేదు. దీంతో కార్మికుల రక్షణ, కార్మిక చట్టాలు, హక్కులు, పరిశ్రమల్లో సేఫ్టీ అంశాలు, పరికరాలపై నిత్యం తనిఖీలు చేయడం వట్టి మాటగానే మారింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట ప్రభుత్వ శాఖల నుండి జరగవలసిన తనిఖీలు దాదాపుగా నిలిపివేశారు. దాంతో కంపెనీల ఇష్టారాజ్యంగా ఉంది. ఫార్మా పరిశ్రమల్లో వినియోగించే హానికరమైన రసాయనాలపై ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించడం, రక్షణ పరికరాలు సమకూర్చడం తదితర చర్యలన్నింటినీ పరిశ్రమలు గాలికొదిలేశాయి. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థ రసాయనాలను శుద్ధి చేయడం, పర్యావరణ పరిరక్షణకు, వాతావరణంలో విష వాయువుల మోతాదును తగ్గించడానికి గ్రీన్ బెల్ట్‌ను ఏర్పాటు చేయడం, రహదారులను నిర్మించడం వంటివి ఎక్కడా కానరావడంలేదు.

ప్రమాదాలు జరుగుతున్నా అదే నిర్లక్ష్యం

ప్రమాదాలు జరిగిన వెంటనే మంత్రులు, ప్రజా ప్రతినిధులు రావడం, కంపెనీల్లో భద్రతా చర్యలు చేపడుతున్నామని ప్రకటించడం ఆనవాయితీగా మారింది. గతంలో సెజ్‌లో జరిగిన ప్రమాదాలపై కమిటీలు వేసి, విచారణ జరిపించిన వైసిపి ప్రభుత్వం ఇంతవరకు ఆ నివేదికలను బయటపెట్టలేదు. కర్మాగారాల్లో భద్రతా చర్యలపై తనిఖీలు చేయాల్సిన పరిశ్రమలు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, తదితర శాఖల అధికారులు యాజమాన్యాలు ఇచ్చే ముడుపులు తీసుకుని 'అంతా బాగానే ఉంది' అని సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. అధికారులు ఏడాదికి రెండుసార్లు ప్రతి కంపెనీ, పరిశ్రమలో భద్రతా ఏర్పాట్లు తనిఖీలు చేసి, లోపాలను సరిచేయించాలి. కానీ జిల్లాలోని పరిశ్రమల్లో ఈ విధంగా తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవనే చెప్పాలి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టి...ఉద్యోగులు, కార్మికుల ప్రాణాలు కాపాడాలి.

/ వ్యాసకర్త సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సభ్యులు /

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

బిజెపి గూటికి అవినీతి నేతల క్యూ

- కేసులన్ని గాలికి.. పార్టీలో చేర్చుకుంటూ పదవులు
- బిజెపి 'వాషింగ్ పౌడర్ నిర్మ' అంటూ సోషల్ మీడియాలో నెటిజన్ల సెటైర్లు



న్యూఢిల్లీ: 'దేశంలో తమ పార్టీలో ఉండే నాయకులు తప్పితే మిగతావారంతా అవినీతిపరులే. ఇతర పార్టీల్లో ఉండే అవినీతిపరులెవరైనా తమ పార్టీలో చేరితే మాత్రం వారు సచ్ఛీలురు' అని బిజెపి అనుసరిస్తున్న తీరు. నాయకులెవరైనా, వారిపై ఉన్న అవినీతి ఆరోపణలతో ఏ మాత్రమూ సంబంధం లేకుండా తమ పార్టీలో చేర్చుకొని ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా పదవులు కట్టబెడుతున్నది. ప్రజాప్రయోజనాలతో సంబంధం లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాలే ధ్యేయంగా కాషాయపార్టీ పని చేస్తున్నది.

ఇటీవల మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 'మేరా బూత్ సబ్‌సే స్ట్రాంగ్' కార్యక్రమంలో ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కాశ్మీర్ నుంచి మొదలుకొని కన్యాకుమారి వరకు ఉన్న రాజకీయ పార్టీల కుటుంబ వారసత్వ రాజకీయాలు, వారి అవినీతి రాజకీయాల గురించి ఈ కార్యక్రమంలో మోడీ ప్రస్తావించారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షం, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీల వరకు.. ప్రతి ప్రధాన పార్టీనీ ఆయన టార్గెట్ చేశారు. ఈ పార్టీల నాయకులు తాము చేసిన అవినీతికి సంబంధించి కటకటాల్లోకి వెళ్లకుండా ఉండేందుకే ప్రతిపక్షాల ఐక్యత పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని పాట్నాలో ప్రతిపక్షాలు నిర్వహించిన సమావేశాన్ని ఉటంకిస్తూ మోడీ అన్నారు.

అయితే, మోడీ వ్యాఖ్యలు చేసిన రెండు, మూడు రోజులకే మహారాష్ట్రలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు తీవ్ర ఆశ్చర్యాన్ని కలిగించకమానవు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్‌సిపి నాయకులు మహారాష్ట్రలోని బిజెపి ప్రభుత్వంలో చేరి పదవులు పొందారు. అజిత్ పవార్‌తో పాటు 8 మంది ఎన్‌సిపి ఎమ్మెల్యేలను కూడా ప్రభుత్వంలో మంత్రులుగా చేశారు. వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఛగన్ భుజ్‌బల్, హసన్ ముష్రిఫ్, అదితి తత్కరేలు తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేంద్ర కనుసన్నల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు వారిపై జరిగాయి. మనీలాండరింగ్ కేసులో ఛగన్ భుజ్‌బల్ ఇప్పటికే రెండేండ్ల జైలు శిక్ష అనుభవించాడు. అతనిపై ఇతర అవినీతికి సంబంధించిన కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉండటం గమనార్హం. హసన్ ముష్రిఫ్ కూడా ఈడీ టార్గెట్‌లో ఉన్నారు. గతంలో ఈడీ దాడులు జరపటంతో ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. బినామీ ఆస్తుల సాయంతో ముష్రిఫ్ రూ. 100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని బిజెపి నేతలే ఆరోపించడం గమనార్హం. అలాగే తత్కరే కుమార్తె అదితి తత్కరే కూడా ఇటీవలి ఫిరాయింపుల్లో పాల్గొన్నది. నీటిపారుదల కుంభకోణంలో సునీల్ కూడా ఈడీ టార్గెట్‌లో ఉన్నారు.

ఒక్క మహారాష్ట్రలోనే కాదు.. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక రాష్ట్రాల్లో పదే పదే ఇదే జరుగుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మోడీ ఒకవైపు విపక్షాలపై అవినీతి ఆరోపణలు చేస్తూ ఎన్నికల ప్రసంగాలు చేస్తూనే మరోవైపు అదే అవినీతి అధికారులను అధికారంకోసం పార్టీలో చేర్చుకుంటున్నారు. ప్రస్తుత అసోం ముఖ్యమంత్రి, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీకి కీలకంగా వ్యవహరిస్తున్న హిమంత విశ్వ శర్మను సైతం ఆయన అవినీతిని ఆయుధంగా వాడుకొని కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి తీసుకొచ్చి మంత్రి, ముఖ్యమంత్రి పదవులను కట్టబెట్టిన సంగతి రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు.

పశ్చిమబెంగాల్‌లోని ప్రజలు రోజ్‌వ్యాలీ స్కామ్, శారదా స్కామ్, టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్, బొగ్గు అక్రమ రవాణా స్కామ్‌లు ఎన్నటికీ మర్చిపోరు. అయితే, ఈ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)లోని ముఖ్య నాయకులైన సువేందు అధికారి, ముకుల్ రాయ్, సోవన్ ఛటర్జీ, జితేంద్ర తివారీలను బీజేపీలో చేర్చుకుని బీజేపీ రాజకీయంగా లబ్ధిపొందింది. వారిపై ఆరోపణలు మానేసింది. కేంద్ర సంస్థలతో వేధింపులను ఆపేసింది.

కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పపై తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో ముఖ్యమంత్రి పదవిని వదులుకుని వెంటనే జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ ఆరోపణలు కూడా ఆయన బిజెపి వీడి సొంత పార్టీ పెట్టడానికి కారణమయ్యాయి. మైనింగ్ కుంభకోణంలో పలుసార్లు జైలుకెళ్లిన యడియూరప్పను మళ్లీ బీజేపీలోకి ఎంట్రీ ఇచ్చి తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రిని చేశారని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేశారు. కర్నాటకలోని బళ్లారి రెడ్డి సోదరులనూ బిజెపి పెంచి పోషించిన విధానాన్ని కూడా ఈ సందర్భంగా ఉటంకించారు.

ఇలా అవినీతిపరులను, మోసగాళ్లను పార్టీలోకి తీసుకురావడం ద్వారా వారికి రక్షణ కల్పించాలన్న బిజెపి విధానాన్ని దేశంలోని ప్రతి మూలన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు సద్వినియోగం చేసుకుంటున్నారని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇతర పార్టీలపై విమర్శలు చేసే ముందు బీజేపీ పార్టీ అవినీతిపై తాను చేసే వ్యాఖ్యలను పాటించే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. ఇటు బీజేపీ చేస్తున్న స్వార్థపూరిత రాజకీయాలపై నెటిజన్లు తమదైన రీతిలో సెటైర్లు వేస్తున్నారు. బిజెపిలో చేరితే అవినీతి మరకలు తొలగిపోతాయని 'వాషింగ్ పౌడర్ నిర్మ' అంటూ కామెంట్లు చేస్తున్నారు.



చైనాతో ఆరోగ్యకరమైన పోటీనే కోరుకుంటున్నాం

- బీజింగ్‌లో అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్

బీజింగ్: చైనాను దెబ్బ తీయడం కోసం అమెరికా ఒక వైపు పావులు కదుపుతూ, మరో వైపు స్నేహ రాగం తీస్తోంది. రెండు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతలను తగ్గించడం కోసమే తాను ఇక్కడికి వచ్చానని ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్న అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ చెప్పారు. అమెరికా కంపెనీల పట్ల చైనా ప్రభుత్వ వ్యవహార శైలిని జానెట్ విమర్శించారు. అలాగే సెమీ కండక్టర్లలో ఉపయోగించే లోహాలపై చైనా ఎగుమతి కంట్రోళ్ళు చైనా ఎత్తివేయాలని కోరారు. వ్యాపారవేత్తల బృందంతో మాట్లాడుతూ యెలెన్, సాంకేతికతల ఎగుమతులపై అమెరికా కంట్రోళ్ళను సమర్థించుకున్నారు. జాతీయ భద్రతకు ఇది అవసరమని అన్నారు. చైనా నుండి అమెరికా ఆర్థిక వ్యవస్థను వేరు చేయడానికి ప్రయత్నిస్తున్నామన్న సూచనలను ఆమె తిరస్కరించారు. చైనాతో ఆరోగ్యకరమైన ఆర్థిక పోటీని అమెరికా కోరుకుంటోందని యెలెన్ చెప్పారు. ఈ మేరకు అమెరికా ఆర్థిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "తన ప్రభుత్వ రంగ సంస్థలు, దేశీయ సంస్థలకు సబ్సిడీలను విస్తరించడం వంటి మార్కెటేతర సాధనాలను చైనా ఉపయోగించడం, విదేశీ సంస్థలకు మార్కెట్ సౌలభ్యానికి గల అవరోధాల గురించి అమెరికా వాణిజ్యవర్గం వ్యక్తం చేసిన ఆందోళనలను నేను ఇక్కడ వీరికి తెలియచేస్తున్నా" అని యెలెన్ పేర్కొన్నారు. దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని రీతిలో ఇటీవల కాలంలో అమెరికా, చైనా సంబంధాలు క్షీణించాయి. పదవీ విరమణ చేస్తున్న చైనా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ యీ గాంగ్, మాజీ ప్రధాని లియూ హీలతో యెలెన్ శుక్రవారం భేటీ అయ్యారు.. వాణిజ్య యుద్ధాల్లో లేదా సంబంధాలను తెంచుకోవడంలో ఎవరూ విజేతలు కాదు అని ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు ఆరోగ్యవంతంగా అభివృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేసేందుకు అమెరికా నిర్దిష్ట చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.

ముగ్గురు ఉద్యోగుల అరెస్టు

- ఒడిషా రైలు ప్రమాదం కేసు

భువనేశ్వర్: ఒడిషాలో ఘోర రైలు ప్రమాదం కేసులో శుక్రవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిబిఐ శుక్రవారం రైల్వేశాఖకు చెందిన ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంత, సెక్షన్ ఇంజినీర్ మొహమ్మద్ ఆమిర్ ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లు ఉన్నారు. సాక్ష్యాలను నాశనం చేయడం తదితర అభియోగాలను వీరిపై సిబిఐ నమోదు చేసింది.

బిజెపి తెలంగాణ ఇన్ ఛార్జ్ గా ప్రకాశ్ జవదేకర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ సహా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పలు రాష్ట్రాలకు పార్టీ ఎన్నికల ఇన్ ఛార్జ్ ను బిజెపి నియమించింది. తెలంగాణకు ఎన్నికల ఇన్ ఛార్జ్ గా కేంద్రమాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ను నియమించింది. అలాగే, సహాయ ఇన్ ఛార్జ్ గా సునీల్ బన్సల్ ఉండనున్నారు. వీరితో పాటు ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ఇన్ ఛార్జ్ ఓపి మాథుర్, రాజస్థాన్ కు ప్రహ్లాద్ జోషి, మధ్యప్రదేశ్ కు భూపేంద్ర యాదవ్ ను నియమించింది. ఈ నియామకాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా చేపట్టినట్లు బిజెపి ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం కారణంగా సికింద్రాబాద్ - రేపల్లె (17645), సికింద్రాబాద్ - మన్మాడ్ (17064), మన్మాడ్ - సికింద్రాబాద్ (17063) రైళ్లను శుక్రవారం రద్దు చేశారు. రేపల్లె - సికింద్రాబాద్ రైలును నడికుడి వరకు, తిరువనంతపురం - సికింద్రాబాద్ రైలును రామన్నపేట వరకు మాత్రమే నడిపారు. సికింద్రాబాద్ - తిరువనంతపురం, సికింద్రాబాద్ - హౌరా, విశాఖ - లింగంపల్లి, నర్సాపూర్ - నాగర్‌సోల్ రైళ్లను ఖాజీపేట మీదగా దారి మళ్లించారు. పలు రైళ్ల సమయాలు కూడా మారాయి.

ప్రధానిపై దుర్భాషలు దేశద్రోహం కాదు

- కర్ణాటక హైకోర్టు



బెంగళూరు : ప్రధాన మంత్రిపై దుర్భాషలాడటం దేశద్రోహం కాదని, పాఠశాల యాజమాన్యంపై దేశద్రోహ కేసును రద్దు చేస్తూ కర్ణాటక హైకోర్టు పేర్కొంది. బీదర్‌లోని షాహీన్ స్కూల్ యాజమాన్యంపై బీదర్ న్యూ టౌన్ పోలీస్ స్టేషన్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కల్బుర్గి బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ చందంగౌడ్ రద్దు చేశారు. ఐపిసి సెక్షన్ 153(ఎ)లోని అంశాలు ఈ కేసులో కనిపించలేదని కోర్టు పేర్కొంది. 'ప్రధానిని పాదరక్షలతో కొట్టాలని దుర్భాషలాడటం అవమానకరం. ప్రభుత్వ విధానంపై నిర్మాణాత్మక విమర్శలు అనుమతించదగినవే. కానీ విధానపరమైన నిర్ణయం తీసుకున్నందుకు రాజ్యాంగాధికారులను అవమానించలేం. కొన్ని వర్గాలకు అభ్యంతరం ఉండవచ్చు' అని జస్టిస్ చందంగౌడ్ తన తీర్పులో పేర్కొన్నారు. పిల్లలు ప్రదర్శించిన నాటకం ప్రభుత్వం వివిధ చట్టాలను విమర్శించిందని.. 'అలాంటి చట్టాలను అమలు చేస్తే, ముస్లిములు దేశం విడిచి వెళ్లవలసి ఉంటుంది' అని ఆరోపించబడినప్పటికీ, పాఠశాల ఆవరణలో నాటకం ప్రదర్శించబడిందని కోర్టు పేర్కొంది. హింసను ఆశ్రయించమని లేదా ప్రజా అశాంతిని సృష్టించడానికి ప్రజలను ప్రేరేపించే మాటలు పిల్లలతో చెప్పబడలేదని న్యాయస్థానం తెలిపింది. నిందితుల్లో ఒకరు తన సోషల్ మీడియా ఖాతాలో నాటకాన్ని అప్‌లోడ్ చేయడంతో నాటకం ప్రజలకు తెలిసిందని హైకోర్టు పేర్కొంది. ప్రజలను ప్రేరేపించే ఉద్దేశంతో లేదా ప్రజా అశాంతిని సృష్టించే ఉద్దేశంతో ఈ నాటకాన్ని ప్రదర్శించారని చెప్పలేమని పేర్కొంది. ఈ విషయంలో సెక్షన్ 124-ఎ, సెక్షన్ 505 (2) కింద నేరం కోసం ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అనుమతించబడదని కోర్టు పేర్కొంది. జనవరి 21, 2020న 4, 5, 6 తరగతుల విద్యార్థులు పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)కి వ్యతిరేకంగా నాటకాన్ని ప్రదర్శించిన తర్వాత పాఠశాల యాజమాన్యంపై దేశద్రోహం కింద కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ తీర్పు చెప్పింది.

'కోరంగి'పై కొరవడిన సంరక్షణ

మొదటి పేజీ తరువాయి

కోత నుంచి భూమిని రక్షిస్తున్నాయి. సారా మాఫియా ఈ అడవులను ఆవాసంగా చేసుకుంది. వాళ్ల వ్యాపారం కోసం మడ అడవులను ధ్వంసం చేస్తోంది.

అడ్డు, అదుపు లేకుండా కొనసాగుతున్న విధ్వంసం

కోరంగి అభయారణ్యాన్ని 1978లో వన్యప్రాణి సంరక్షణ కేంద్రంగా ప్రకటించారు. కోరంగి వన్యప్రాణి సంరక్షణకు సరిహద్దులు నిర్ణయిస్తూ 2021లో కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రక్షిత అడవులు, దానికి అనుసంధానంగా ఉన్న 235.70 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలోకి చేర్చారు. దీనిని ఎకో సెన్సిటివ్ జోన్ పర్యవేక్షణకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేయాల్సి ఉంది. అయితే, క్షేత్ర స్థాయిలో అటవీ, మత్స్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి ఇతర ముఖ్య శాఖల పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా మడ అడవుల విధ్వంసం కొనసాగుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో ఉన్న రొయ్యలు ప్రాసెసింగ్ యూనిట్లు వదులుతున్న కాలుష్య నీటితో మడ అడవుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు నాటు సారా తయారీ స్థావరాల కోసం భారీ వృక్షాలను మాఫియా విచ్చలవిడిగా నాశనం చేస్తోంది. సముద్ర తీరం వెంబడి మడ అడవులను ధ్వంసం చేసి ఏర్పాటు చేసిన నాటు సారా తయారీ కేంద్రాలపై అధికారులు దాడులు చేస్తున్నా ఈ దందా, చెట్ల నరికివేత మాత్రం ఆగడం లేదు. ఇక్కడ పర్యవేక్షణకు ఒక రేంజర్, ఇద్దరు సెక్షన్ ఆఫీసర్లు, ఏడుగురు బీట్ ఆఫీసర్లు ఉన్నా అడవుల ధ్వంసం కొనసాగుతూనే ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరంతరం నిఘా

కోరంగి మడ అడవుల్లో నాటు సారా తయారీపై నిరంతరం నిఘా ఉంచుతున్నాం. అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాం. 2021 నవంబరులో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖాధికారుల సహకారంతో 2.30 లక్షల బెల్లం ఊటను ధ్వంసం చేశాం. అక్రమంగా ప్రవేశించిన ఎనిమిది ఫైబర్ బోట్లను సీజ్ చేశాం. టూరిజం ద్వారా ఆదాయం పెరిగే విధంగా కృషి చేస్తున్నాం.

- ఎస్.వర ప్రసాద్, కోరంగి అటవీ శాఖ రేంజ్ అధికారి

రాహుల్‌కు దక్కని న్యాయం

మొదటి పేజీ తరువాయి

రాహుల్ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేయాలని.. అలాగే తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలంటూ రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఏప్రిల్‌లో విచారణ జరిపిన సెషన్స్ కోర్టు.. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, జైలు శిక్షపై స్టే ఇచ్చేందుకు మాత్రం నిరాకరించింది. దీంతో రాహుల్ గాంధీ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీపై విధించిన శిక్షపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన గుజరాత్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వెల్లడించారు. కోజికోడ్‌లో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్తామని చెప్పారు.



మీకోసం

దోశల పిండి బాగా పులిసిపోతే అందులో రెండు చెంచాల గోధుమపిండి కలపాలి.

జీవన సౌరభం

చేయాలన్న పట్టుదల, చేయగలను అన్న నమ్మకం ఉంటే అద్భుతాలు సాధ్యమే..

బతక గలడె నరుడు!



చెట్టే నీ తోడు
చెట్టే నీ గూడు
చెట్టును పోషించకుంటె
బ్రతుకంతా గోడు!

చెట్టే నీ నీడ
చెట్టే నీ వాడ
చెట్టును పోషించకుంటె
పడుతుందట చీడ!

చెట్టే నీ నాడి
చెట్టే నీ మేడి
చెట్టును పోషించకుంటె
పుట్టదు గద పాడి!

చెట్టే నీ ప్రాణం
చెట్టే నీ బాణం
చెట్టును పోషించకుంటె
తప్పదుగద మరణం!

చెట్టే నీ హితుడు
చెట్టేనీ గురుడు
చెట్టును పోషించకుంటె
బ్రతుక గలడె నరుడు!

చెట్టే నీతల్లి
చెట్టు కల్పవల్లి
చెట్టును పోషించకుంటె
ఏడుస్తావ్ కుళ్ళి!


చెట్టే నీ గొడుగు
చెట్టే నీ తొడుగు
చెట్టును పోషించకుంటె
నీవె ఒక వెడగు!

చెట్టే నీ పడక
చెట్టే నీ తడక
చెట్టును పోషించకుంటె
సాగదు నీ నడక

చెట్టే నీ కులము
చెట్టే నీ మతము
చెట్టును పోషించకుంటే
లేదు భావి కాలము!

చెట్టే నీ దళము
చెట్టే నీ బలము
చెట్టును పోషించకుంటె
పలకదు నీ గళము!

- కిలపర్తి దాలినాయుడు
సాలూరు



దారి చూపండి

చిన్నారులూ, ఇక్కడ ఉన్న కుక్క, పిల్లి స్నేహితులు. మరి రెండూ ఎలా కలుస్తాయో చూపరూ!

నేను గీసిన బొమ్మ




- ద్రితి బాస,
2వ తరగతి,
షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూలు,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ డ్రైవరు కోసం 30 ఏళ్ల నిరీక్షణ

ఆటోలో ప్రయాణిస్తున్న పాసింజర్లు ఒక్కోసారి తమ బ్యాగులు, విలువైన వస్తువులు, నగలు, డబ్బు వంటివి మర్చిపోయి ఆటో దిగినప్పుడు.. ఆ ఆటోడ్రైవరు వాటిని తిరిగి వాళ్లకి అప్పగించిన ఘటనలు అనేకం వెలుగుచూస్తుంటాయి. అలా అనేకమంది డ్రైవర్ల ఉదార స్వభావం గురించి వార్తలు రావడం మనకు తెలుసు. అయితే ఇప్పుడు మనం చెప్పకుంటున్నది అటువంటి డ్రైవరు గురించే.. కానీ ఇతను అందరిలా వస్తువులు అప్పగించలేదు. అర్ధరాత్రి సమయంలో తన ఆటోలో ఓ ప్రయాణికుడిని ఉచితంగా గమ్య స్థానానికి చేర్చాడు. అది అతను అప్పడే మర్చిపోయినా ఆ సాయం పొందిన వ్యక్తి మాత్రం 30 ఏళ్లుగా ఆ డ్రైవరును వెతికి మరీ అతను ఊహించని ప్రతిఫలం అందించాడు. కేరళలో జరిగిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే..



అజిత్ బాబు

అజిత్ బిఇడి పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. నిరుద్యోగిగా రోజు వారీ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఒకసారి తన స్నేహితుడి ఇంటికి వెళ్లి తిరిగి తన రూమ్‌కి బయల్దేరాడు. రెండు బస్సులు మారినా అతను చేరుకోవాల్సిన ప్రదేశానికి చేరలేదు. చివరిగా తన కాలనీకి వెళ్లే బస్సు ఎక్కేందుకు ప్రయత్నించినప్పటికీ బస్ స్టాండ్‌కి చేరుకునేసరికి అదీ వెళ్లిపోయింది. అతని దగ్గర బస్సు చార్జీలే ఉన్నాయి. బస్సు వెళ్లిపోయింది. 'నడుచుకుంటూ వెళ్దామంటే 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. బాగా పొద్దుపోయింది. ఆ సమయంలో అంత దూరం వెళ్లడం ఎలా? ఇదే ఆలోచిస్తూ బస్ స్టాండ్‌లో కూర్చొండిపోయాను. ఆటో వాళ్లు చాలామంది వచ్చి అడిగారు. నా దగ్గర బస్సుకు సరిపడా డబ్బులు మాత్రమే ఉన్నాయి. దీంతో వాళ్లకి రానని చెప్పాను. కానీ ఎంతసేపు అలా.. ఆటోలన్నీ వెళ్లిపోతే నేనొక్కడినే ఆ చీకటిలో అక్కడే ఉండిపోవాలి. అప్పుడు నా మెదడులో ఎన్నో ప్రశ్నలు.. చివరికి ఒక నిర్ణయానికి వచ్చాను. నా దగ్గర డబ్బులు లేవని చెప్పి సాయం అడుగుదామనుకున్నాను. ఈలోపు నా దగ్గరికి ఒక ఆటో వచ్చి ఆగింది. అతనితో నా పరిస్థితి గురించి చెప్పాను. అతను క్షణం కూడా ఆలోచించకుండా.. 'రా వచ్చి కూర్చో.. నేను నీ గది దగ్గర దింపుతాను. డబ్బులు ఏమీ వద్దులే' అన్నాడు. నాకు చాలా సంతోషమేసింది. సాధారణంగా ఆ రాత్రి వేళ మామూలు కంటే ఎక్కువ డబ్బులు అడుగుతారు. కానీ ఆ ఆటో డ్రైవరు ఉచితంగా నన్ను తీసుకెళ్తానన్నాడు. మాటల్లో అతని పేరు బాబు అని తెలుసుకున్నాను. ఆ రోజు జరిగిన సంఘటన నా మనసులో బలంగా నాటుకుపోయింది. ఆ డ్రైవరు చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోకూడదనుకున్నాను. ఆ రాత్రి ఆటో దిగుతూ మళ్లీ మనం ఎప్పుడైనా కలిసినప్పుడు రూ.100 ఇస్తానని చెప్పాను. ఇప్పుడు అతని రుణం తీర్చుకున్నాను' అంటూ 30 ఏళ్ల క్రితం జరిగిన సంఘటన గురించి చెబుతున్నప్పుడు అజిత్ కళ్లల్లో నీళ్లు కనిపించాయి.

ప్రస్తుతం అజిత్ కొచ్చి కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కేరళ కొలంచెరిలో ఇల్లు కట్టుకుని భార్యాపిల్లలతో నివసిస్తున్నాడు. ఉద్యోగబాధ్యతల్లో తలమునకలైనా.. కుటుంబంతో సంతోషంతో గడుపుతున్నా బాబు గురించే ఆలోచించేవాడు. 30 ఏళ్లుగా అతని కోసం వెతుకుతూనే ఉన్నాడు. ఒక రోజు ఉదయం పూట అతని ఇంటి ముందు ఒక ఆటో ఆగింది. 'ఎవరినో పాసింజర్‌ని దింపడానికి ఆ ఆటో వచ్చింది. ఆ ఆటో డ్రైవరు చూడడానికి బాబులా ఉన్నాడు. అతన్ని చూడడంతోనే నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆటో దగ్గరికి పరుగుపెట్టాను. చాలా దగ్గరగా బాబును చూశాను. అతనే.. ఆ రోజు నాకు సాయం చేసిన మానవతావాది. నన్ను గుర్తుపట్టారా అని ఎంతో ఉత్సాహంగా అడిగాను. అతను లేదని తల అడ్డంగా తిప్పాడు. అప్పుడు నా జేబులో ఉన్న పర్సు తీసి అందులో ఉన్న నా పాత ఫొటో చూపించాను. అది చూడగానే అతను కూడా నన్ను గుర్తుపట్టాడు' అంటూ ఇటీవల జరిగిన సంఘటన గురించి చెబుతున్న అజిత్, బాబును తన ఇంట్లోకి సాదరంగా ఆహ్వానించి తన కుటుంబసభ్యులను పరిచయం చేశాడు. ఇన్నేళ్లుగా అజిత్ వెతుకున్న వ్యక్తి తమ కళ్లముందు కనపడేసరికి కుటుంబమంతా ఎంతో సంతోషపడింది.

అప్పుడే అజిత్ ఓ మూసి వుంచిన కవరు తెచ్చి బాబు చేతిలో పెట్టాడు. దాన్ని ఇంటికి వెళ్లేవరకు తెరవవద్దని చెప్పాడు. తన పట్ల అజిత్ చూపిస్తున్న ఆప్యాయతకు ఉక్కిరిబిక్కిరవుతున్న బాబు 'నేను ఆ రోజు మీకు చేసింది చాలా చిన్న సాయం. కానీ మీరు ఇన్ని సంవత్సరాలు అది గుర్తుపెట్టుకున్నారు. అదే చాలు.. ఇవన్నీ వద్ద'ని వారించాడు. అయినా అజిత్ ఆ కవరును బాబుకు ఇచ్చాడు.

ఆ కవరులో ఏముందంటే..

బాబు చేతికి ఇచ్చిన ఆ కవరులో రూ.10 వేలు ఉన్నాయి. ఆ రోజు అజిత్ చెప్పిన వంద రూపాయల సాయం కంటే అది వంద రెట్లు. అయితే అజిత్ దృష్టిలో బాబు చేసిన సాయం వెలకట్టలేనిది. అందుకే త్వరలో కూతురు పెళ్లి చేస్తున్న బాబుకు ఈ సాయం ఎంతో కొంత ఊరటనిస్తుందని సంతోషపడుతున్నాడు. ఈ మొత్తం వృత్తాంతంలో అర్ధరాత్రి ఓ నిస్సహాయుడికి సాయం చేసిన బాబు, మూడు దశాబ్దాలు గడిచినా ఆ సాయం గుర్తుంచుకుని అతను ఊహించని బహుమతి ఇచ్చిన అజిత్ ఇద్దరూ మానవతా హృదయులే..

మొక్కజొన్నతో ఆరోగ్యం

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు వేడి వేడిగా ఏమైనా తినాలనిపిస్తుంది. బయట ఫుడ్ కన్నా ఇంట్లో చేసుకునే ఆహారానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే నూనెతో చేసిన పదార్థాల కన్నా మొక్కజొన్న పొత్తు చాలా బెటర్. ఈ సమయంలో మొక్కజొన్న విరివిగా, అతి చౌకగా లభించే ఆహారం. దీని గింజలను పచ్చిగా కాని, కాల్చుకొని లేదా ఉడకబెట్టుకొని తినొచ్చు. ఇది చాలా బలమైన ఆహారపదార్థం. ఇవి ఈ సీజన్‌లో తినడం వల్ల ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

- మొక్కజొన్నలో లినోలిక్ ఆసిడ్, విటమిన్ ఇ, బి1, బి6, నియాసిన్, ఫోలిక్ ఆసిడ్, రైబోఫ్లోవిన్ అనే విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. పీచు పుష్కలంగా ఉంటుంది. అది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది. ఆహారంలో పీచు ఉంటే అది మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్ అరికడుతుంది.
- ఎముకల బలానికి అవసరమైన లవణాలు, మినరల్స్ మొక్కజొన్నలో పుష్కలంగా ఉంటాయి. పసుపు రంగులో ఉండే ఈ చిన్న గింజలలో మినరల్స్ అధికంగా ఉంటాయి. మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ వంటివి కూడా వీటిలో ఉండి ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచటంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి.
- మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతుంది. మొక్కజొన్న గింజల నూనెను చర్మానికి రాస్తే దీనిలో ఉండే లినోలె యాసిడ్ చర్మ మంటలను, ర్యాష్‌లను తగ్గిస్తుంది.
- మొక్కజొన్నలో ఫోలిక్ యాసిడ్ ఉండటం వలన అది రక్తహీనతను తగ్గిస్తుంది. మొక్కజొన్నను ప్రతిరోజు తినడం వల్ల జుట్టు మొదళ్లకు బలాన్ని చేకూరుస్తుంది. దాంతో జుట్టురాలిపోదు. ఇందులో ఉండే విటమిన్ సి పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్ లైకోపిన్ వల్ల జుట్టు మెత్తగా, మృదువుగా మారుతుంది.





ఆర్డినెన్స్ మనుగడలో ఉందా?

మహిళా సంరక్షణ కార్యదర్శుల్ని మహిళా పోలీసులుగా పరిగణించిన కేసులో హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాలకు చట్టబద్ధత, మహిళా కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించడాన్ని సవాల్ చేసిన కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జారీ చేసిన ఆర్డినెన్స్‌కు సంబంధించిన వివరాలు నివేదించాలంది. ఆర్డినెన్స్ మనుగడలో ఉందో లేదో కూడా చెప్పాలంది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఆదేశించింది. మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పరిగణించే జిఓలను విశాఖకు చెందిన ఆరేటి ఉమామహేశ్వరావు సవాల్ చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ జరిపింది. జిఓకు అనుగుణంగా జారీ చేసిన ఆర్డినెన్స్ గడువు గత జూన్ 7తో ముగిసిందని పిటిషనర్ న్యాయవాది ఎన్ శ్రీనివాస్‌రావు చెప్పారు.

మహిళా సంరక్షణ కార్యదర్శులుగా సచివాలయాల్లో పనిచేసేందుకు వాళ్లను పోలీస్ శాఖలోకి తీసుకొస్తూ వారిని మహిళా పోలీసులుగా పరిగణించడం అన్యాయమన్నారు. పోలీస్ దుస్తులు వేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ విధానానికి విరుద్ధంగా ప్రభుత్వ ఆర్డినెన్స్ ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ ప్రతివాదన చేస్తూ.. మహిళా పోలీసులగానే పిలుస్తారని, పోలీస్ విధుల్ని నిర్వహించరని చెప్పారు.

యూనిఫాం ధరించారని చెప్పి వాళ్లను రెగ్యులర్ పోలీసులుగా చూడకూడదని అన్నారు. అలాగే మహిళా కానిస్టేబుళ్లుగా పరిగణించడం తమకు సమ్మతమేనని పేర్కొంటూ పలువురు మహిళా సంరక్షణ కార్యదర్శులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను విచారించేందుకు హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

టిడిపి నేతలకు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

పల్నాడు జిల్లా కారంపూడి పోలీసులు గత నెల 20న నమోదు చేసిన కేసులో టిడిపి నేతలు నలుగురికి హైకోర్టు శుక్రవారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. షేక్ సైదా, బి శ్రీనివాసరావు, ఉన్నం లక్ష్మీనారాయణ, బి మల్లికార్జునరావుకు జస్టిస్ కె సురేష్‌రెడ్డి బెయిల్ మంజూరు చేశారు. ఇరువురికీ స్వల్ప గాయలే అయ్యాయని, ఇరుపక్షాలపై కేసులు నమోదయ్యాయని, అందుకే పిటిషనర్లకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. కారంపూడి పిఎస్‌లో లొంగిపోవాలని, వాళ్ల నుంచి పూచీకత్తులు తీసుకుని బెయిల్ ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. ప్రతి సోమ, గురువారాల్లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఎస్‌హెచ్‌ఒ ఎదుట హాజరుకావాలన్నారు. కారంపూడిలో టిడిపి, వైసిపి నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఇరుపక్షాలపై కేసులు నమోదయ్యాయి. ఓ వ్యక్తి కారును ధ్వంసం చేశారనే ఫిర్యాదు ఆధారంగా టిడిపి నేతలపై హత్యాయత్నం ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో వారంతా హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందారు.

రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లింపునకు రూ.200 కోట్లు

హైకోర్టుకు తెలిపిన సిఆర్‌డిఎ

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపునకు రూ.200 కోట్లు విడుదల చేసినట్లు హైకోర్టుకు సిఆర్‌డిఎ తెలిపింది. ఈ మేరకు జిఓ జారీ అయ్యిందని, త్వరలోనే ఆ డబ్బు భూములిచ్చిన వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని సిఆర్‌డిఎ తరపున న్యాయవాది పేర్కొన్నారు. ఇవే వివరాల్ని లిఖితపూర్వకంగా నివేదించాలని సిఆర్‌డిఎను న్యాయమూర్తి జస్టిస్ బి కృష్ణమోహన్ శుక్రవారం ఆదేశించారు. కౌలు చెల్లింపులో జాప్యం చేయడాన్ని ప్రశ్నిస్తూ మంగళగిరికి చెందిన రైతు పోతినేని శ్రీనివాసరావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

కొత్త ఫీచర్లతో నికాన్ జెడ్8 అత్యాధునిక కెమెరా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇమేజింగ్ టెక్నాలజీలో కొత్త ఫీచర్లతో నికాన్ జెడ్8 కెమెరా మార్కెట్‌లోకి వచ్చింది. ఈ మేరకు శుక్రవారం నికాన్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జోగి ఫ్రాన్సిస్ విజయవాడలోని ఓ హోటల్‌లో నికాన్ జెడ్8 కెమెరాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ.. ఇమేజింగ్ టెక్నాలజీలో అగ్రగామి అయిన నికాన్ కంపెనీ కొత్త ఫీచర్లతో ఈ కెమెరాను మార్కెట్‌లోకి తెచ్చిందన్నారు. ల్యాండ్ స్కేప్ హైస్పీడ్ ఫ్రేమ్ క్యాప్చర్ ఈ కెమెరా ప్రత్యేకత అని తెలిపారు. ఈ కెమెరాతో 90 నిమిషాలపాటు 8కె వీడియోలను తీసుకోవచ్చని అన్నారు. ఫ్యాషన్స్, క్రీడలు, లైవ్ వెడ్డింగ్, సినిమాటోగ్రఫీలకు ఈ కెమెరా బాగా పనిచేస్తుందన్నారు.

అమూల్‌కు రాష్ట్రం తాకట్టు

కర్ణాటక, తమిళనాడు వద్దంటే తెచ్చిన జగన్ • టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు, ఒంగోలు డెయిరీ ఆస్తులను అమూల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిచ్చారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. అమూల్ బేబీకి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన వైసిపి నేతలు పాణ్యం సావిత్రమ్మ, పాణ్యం సుబ్బారాయుడు టిడిపి కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రొద్దుటూరులో మూతపడ్డ డెయిరీని తెరిపించలేదని, చిత్తూరు డెయిరీని అమూల్‌కు అప్పగించేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.6 వేల కోట్ల ప్రజల ఆస్తులు రాసిచ్చేశారని ఆరోపించారు. కర్ణాటకలో అమూల్‌ను తిరస్కరించారని, తమిళనాడు వాళ్లు వద్దంటే జగన్ రాష్ట్రానికి తెచ్చారని అన్నారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన జగన్ ఏం సాధించారని నిలదీశారు. హోదా తెచ్చారా? పోలవరం నిధులు తెచ్చారా? విభజన హామీలు సాధించారా? అని ప్రశ్నించారు. ముందస్తు ఎన్నికలంటూ వాళ్లే లీకులిచ్చి, వాళ్లే ఖండిస్తారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి సిద్ధమని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయి వుంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని, గోదావరి-పెన్నా అనుసంధానం జరిగితే రాష్ట్రంలో నీటి కొరతే ఉండదన్నారు. ఆడబిడ్డలకు రక్షణ లేదని, రేపల్లెలో జరిగిన అమర్‌నాథ్ ఘటన కలిచివేసిందన్నారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే అరాచకం వల్ల సిఐ ఆనందరావు ఆత్మహత్య చేసుకున్నారని, టిడిపి అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు, నిత్యావసర ధరలు తగ్గిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, రిటైర్డు పోలీస్ అధికారి పిసి స్వామి, ఆర్‌అండ్‌బి ఇంజినీర్ జివి కృష్ణయ్య కూడా చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు.



ఆసియా క్రీడల్లో ఇరుజట్లకూ ప్రాతినిధ్యం

బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్ ఆమోదం

ముంబయి: చైనా వేదికగా జరిగే ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళల జట్లను పంపేందుకు బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఆసియా క్రీడల్లో పురుషుల, మహిళల జట్టు ప్రాతినిధ్యం వహిస్తాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆసియా క్రీడలు జరిగే సమయంలోనే భారత్‌లో వన్డే ప్రపంచకప్ ఉన్న దృష్ట్యా పురుషుల ద్వితీయశ్రేణి జట్టును పంపాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆ జట్టుకు శిఖర్ ధావన్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముంది. మహిళల జట్టును మాత్రం పూర్తిస్థాయిలో పాల్గొంటుందని వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి పురుషుల క్రికెట్, సెప్టెంబర్ 19నుంచి మహిళల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. 2014లో చివరి సారిగా ఆసియా క్రీడల్లో క్రికెట్‌కు చోటు కల్పించినా.. భారతజట్టు ప్రాతినిధ్యం వహించలేదు. ఇక సెప్టెంబర్-అక్టోబర్‌లో చైనాలోని హాంగ్‌ఝూ వేదికగా ఆసియా క్రీడలు జరగనున్న సంగతి తెలిసిందే. ఆసియా క్రీడల్లో పాల్గొనే ఇరుజట్ల జాబితాలను జులై 15న వెల్లడించనున్నట్లు బిసిసిఐ ఓ ప్రకటనలో తెలిపింది. అక్టోబర్ 16 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ ప్రారంభం కానుంది.

ఇంపాక్ట్ ప్లేయర్‌కు అవకాశం..

ఐపిఎల్‌లో ప్రవేశపెట్టిన ఇంపాక్ట్ రూల్‌ను దేశవాళీ క్రికెట్‌లోనూ అమల్లోకి తీసుకురావాలని బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. అక్టోబర్ 16 నుంచి ప్రారంభమయ్యే సయ్యద్ ముస్తాఖ ట్రోఫీలో ఈ రూల్‌ను అందుబాటులోకి తేనుంది. గత సీజన్‌లోనూ ఇంపాక్ట్ రూల్ ఉన్నప్పటికీ.. కేవలం 14వ ఓవర్ ముగింపు తర్వాతనే ఇంపాక్ట్ ప్లేయర్‌ను తీసుకొనేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఐపిఎల్‌లో మాదిరిగానే టాస్ సమయంలోనే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్ల పేర్లను ఆయా జట్ల కెప్టెన్లు వెల్లడించాల్సి ఉంటుంది.

క్వార్టర్స్‌కు సింధు, లక్ష్యసేన్

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఒట్టావా(కెనడా): కెనడా ఓపెన్ సూపర్-500లో క్వార్టర్‌ఫైనల్లోకి భారత టాప్ షట్లర్లు లక్ష్యసేన్, పివి సింధు దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో సింధు ప్రత్యర్థి జపాన్‌కు చెందిన నట్సుకీ నిడైర్ మ్యాచ్ నుంచి అర్ధాంతరంగా వైదొలిగింది. దీంతో సింధుకు వాకోవర్ లభించింది. ఇక లక్ష్యసేన్ 21-15, 21-11తో బ్రెజిల్‌కు చెందిన యోర్ కొహెల్కోపో వరుససెట్లలో నెగ్గాడు. ఈ మ్యాచ్‌ను లక్ష్యసేన్ కేవలం 31 నిమిషాల్లోనే ముగించాడు. క్వార్టర్‌ఫైనల్లో సింధు.. 2022 ఇండోనేషియా మాస్టర్స్ ఛాంపియన్ గో-ఫెంగ్-జియో(చైనా)తో తలపడనుంది. ఇక కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన లక్ష్యసేన్.. బెల్జియంకు చెందిన జులెన్ కర్రగ్గితో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్ గరగ-విష్ణువర్ధన్ జోడీ ప్రి క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. ప్రి క్వార్టర్స్‌లో భారతజోడీ 9-21, 11-21తో ఇండోనేషియాకు జోడీ చేతిలో ఓటమిపాలైంది.

ఇంగ్లండ్ 237ఆలౌట్

లీడ్స్: యాషెస్ సిరీస్ మూడో టెస్ట్‌లో బెన్ స్టోక్స్ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. 6ఫోర్లు, 5సిక్సర్ల సాయంతో 80పరుగులు చేసి మర్ఫీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 237పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 69పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ జట్టు 87పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత వోక్స్(10), వుడ్(24) సహకారంతో బెన్ స్టోక్స్ విధ్వంస ఇన్నింగ్స్ ఆడి చివరి వికెట్‌గా పెవీలియన్‌కు చేరాడు.కమిన్స్‌కు ఆరు వికెట్లు దక్కాయి. అనంతరం ఆసీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 116పరుగులు చేసింది.

మూడోరౌండ్‌కు సబలెంక, క్వితోవా

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ



క్వితోవా



సబలెంకా

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ మూడోరౌండ్‌లోకి 2వ సీడ్ సబలెంక(రష్యా), చెక్ రిపబ్లిక్‌కు చెందిన 9వ సీడ్ పెట్రా క్వితోవా, అమెరికాకు చెందిన 25వ సీడ్ కీస్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన రెండో రౌండ్ పోటీలో క్వితోవా 6-2, 6-2తో సన్సోవిచ్ (రష్యా)పై, కీస్ 7-5, 6-3తో గోలుబిక్(స్విట్జర్లాండ్)పై వరుససెట్లలో గెలిచారు. మరో పోటీలో 29వ సీడ్ బెగూ(రొమేనియా) 5-7, 3-6తో అన్‌సీడెడ్ బ్లింకోవా(రష్యా) చేతిలో వరుససెట్లలో ఓడింది. మరో పోటీలో సబలెంకా 2-6, 7-5, 6-2తో గ్రచేవా(ఫ్రాన్స్)ను, 19వ సీడ్ అజరెంకా(రష్యా) 11వ సీడ్ కసట్కినా(రష్యా)ను 6-2, 6-4తో ఓడించి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లింది.

అల్కరాజ్, మెద్వదెవ్, రూనే జోరు..

పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్, 3వ సీడ్ డానియెల్ మెద్వదెవ్, 6వ సీడ్ రూనే(స్విట్జర్లాండ్) మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో అల్కరాజ్ 6-4, 7-6(7-2), 6-3తో ముల్లర్(ఫ్రాన్స్)పై, మెద్వదెవ్ 6-3, 6-3, 7-6(7-5)తో మన్నారిండో(ఫ్రాన్స్)పై, రూనే 6-3, 7-6(7-3), 6-3తో కర్బెలేస్(స్పెయిన్)పై గెలిచారు. ఇక 17వ సీడ్ హుర్కాజ్ (పోలండ్) 7-6(7-4), 6-4, 6-4తో 14వ సీడ్ ముసెట్టి(ఇటలీ)ని చిత్తుచేశారు. 19వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 6-4, 5-7, 6-2, 6-2తో వతనుకి(జపాన్)పై గెలిచాడు. మరో పోటీలో 8వ సీడ్ జెన్నిక్ సిన్నర్(ఇటలీ) 3-6, 6-2, 6-3, 6-4తో తన దేశానికే చెందిన హయల్స్‌ను, అన్‌సీడెడ్ బెరెట్టిని(ఇటలీ) 6-3, 6-4, 6-4తో 15వ సీడ్ డి-మినార్‌ను ఓడించి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68